

నవయుగ

ప్రజా జీవితచిత్రాలు

యువకులైన ఫోటోగ్రాఫర్లు ప్రజాజీవితాన్ని చిత్రించేఫోటోలు తీసి యీ శీర్షికక్రింద ప్రచురణకు పంపకోరుతాం. ... ...

— సంపాదకులు.



గుజరాతీ స్త్రీ



వీరేశలింగం వర్ధంతి

యుగపురుషుడని ఖ్యాతిగన్న కందుకూరి వీరేశలింగం వర్ధంతినాడు (మే **27** సాయంత్రం 6–30 లకు) ఆంధ్ర ప్రజానాట్యమండలి రాష్ట్ర దళం వారిచే – మద్రాసు రేడియో స్టేషన్ నుండి–

వీరేశలింగం చరిత్ర

బుర్రకథగా చెప్పబడుతుంది.

★  ★

కథనం:— శ్రీ పట్టంశెట్టి ఉమామహేశ్వరరావు
వంతలు:— శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
శ్రీ మాచినేని వెంకటేశ్వరరావు

గమనిక

ఆఫీసు మార్పు

నవయుగ ఆఫీసు అరండల్ పేట నుండి
కొత్తపేట మెయిన్‌రోడ్డుకు మార్చబడింది.
మార్పును గమనించి సోదరులంతా

మేనేజరు:—
నవయుగ
మెయిన్‌రోడ్డు, కొత్తపేట
గుంటూరు
అని వ్రాయవలెను.

నవయుగ

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి, యువజన మాసపత్రిక.

సంపుటి 1 | 1947 మే | సంచిక 3

సంపాదకీయం విద్యావిధాన రక్షణకు మంత్రివర్గం పూనుకోవాలి

కాంగ్రెస్ మంత్రివర్గంస్వీకరించి సంవత్సర కాల మయింది మంత్రివర్గం అధికారం స్వీకరించిన పిదప రాష్ట్రంలోని విద్యాలయాలన్నీ ఒక సంవత్సరం గడపి శలవలకు మూసి వేశారు. తిరిగి నెల రోజులలో తెరవ నున్నారు. ఈ సంవత్సర కాలంలో విద్యార్థులను అనేక తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నాయి. ఈ సమస్యల పరిష్కార మునకు ప్రజా ప్రతినిధులు సాయ పడతారని విద్యార్థులు ఎదురు జూచారు కాని నిరాశ చెందక తప్పలేదు. కాంగ్రెస్ సంవత్సర కాలం అధికారంలో నున్నా ఆ విద్యా సమస్యలను పరిష్కరించ లేక పోయింది పైపెచ్చు విద్యా సమస్యలు రోజురోజుకూ తీవ్రమయినాయి ప్రతి విద్యాలయం సమ్మెల ప్రవాహంలో తేలి ఆడక తప్పలేదు. ఇది ప్రతి విద్యార్థి, సంరక్షకుడు గుర్తించిన నగ్నసత్యం

విద్యా సంస్కరణలయెడ మంత్రివర్గం జూపిన అశ్రద్ధకు విద్యార్థులు నిరాశచెంది ఊరుకోలేదు తమ శక్తినిస ంఘటిత పర్చారు. ప్రజల తలిదండ్రుల సహాయ సానుభూతులను సంపాదించారు మంత్రివర్గం పోలీసు రిపోర్టులను నమ్మి పోలీసులను ప్రయోగించినా, యీ సమ్మెలు కమ్యూనిస్టులచే రెచ్చగొట్టబడినవని ప్రభుత్వం నిందారోపణ జేసినా విద్యార్థుల ఐక్యత విచ్ఛిన్నంకాలేదు. పైపెచ్చు అనేకచోట్ల విద్యార్థి ఫెడరేషన్-విద్యార్థి కాంగ్రెస్ సంస్థలు భుజంభుజంకలసి పోరాడారు. విద్యార్థుల ఐక్యతను చాటుతూ కాంగ్రెసు-కమ్యూనిస్టుభేదములను అవకాశంగా తీసుకొని అతివాద శక్తులపై నిర్బంధమును ప్రయోగించ జూచే సామ్రాజ్యవాదులకు పారం చెప్పారు

తిరిగి విద్యాలయములు కొద్దిరోజులలో ప్రారంభించబోతున్నారు. ప్రభుత్వం విద్యాలయాలలో "శిక్షణ" "శాంతి" కావాలంటుంది. గురు, శిష్యులమధ్య చక్కని సామరస్యం ఏర్పడాలని ప్రకటనలు చేసింది. విద్యార్థులు ప్రభుత్వంయొక్క యీ ఆశయాలతో ఏకీభవించుతారు కాని సమస్యల్లా యీ "శాంతి", "శిక్షణ", "విధేయతా" పోలీసు బలంతో విద్యాలయాలలో నెలకొల్పుటా లేక విద్యాసమస్యలను పరిష్కరించి, స్వతంత్ర విద్యావిధానమును ఏర్పరచుటద్వారా నెలకొల్పుటా ? గత సంవత్సరం విద్యార్థులు జరిపిన ప్రతిసమ్మెపై పోలీసులు ప్రయోగింపబడ్డాదు. విద్యార్థులు అరెస్టు చేయబడ్డారు. లాఠీచార్జీలు జరుపబడ్డాయి. ఐందరు ప్రిన్సిపాలువంటి కసాయిలను విద్యామంత్రి, విశ్వవిద్యాలయం బలపర్చారు. అయినా విద్యార్థి పోరాటాలు విచ్ఛిన్నం జేయబడినవా ? లేదు. ఇనుమడించిన శక్తితో, ప్రజలసహాయంతో ముందుకు సాగి పోయినాయి. స్వతంత్ర విద్యావిధానమును ఏర్పర్చుతామనిన ఎన్నికలలో శాంతి యుండదని ప్రభుత్వం గుర్తించాలి. ఈ సమస్యలు పరిష్కరించబడుటకు బదులు, పోలీసు ప్రయోగం పరిస్థితులను తీవ్రపరుటకు మాత్రం తోడ్పడతాయి. విద్యార్థులు కోరేది వెనుక కాంగ్రెస నాయకులు జరుపుతామని వాగ్దానం చేసినవే. క్రొత్తకోర్కెలేమీకాదు ఈ కోర్కెలు అమలు జరిపినప్పుడే విద్యాలయాలలో నిజమైనశాంతి.

కాంగ్రెసు అధికారంలోకివచ్చి బోర్డు మ్యునిసిపల్ స్కూళ్ళలో జీతాలు పెంచమని హుకుం జారీచేసింది, ఉపాధ్యాయుల కోర్కెల నంగీకరించక వారిని సమ్మె ప్రయత్నాలకు నెట్టుచున్నారు. పదివేలమంది ఈ సంవత్సరం నూతనంగా స్కూలుఫైనలు పరీక్షకు హాజరయినా కళాశాలలో ఎట్టి నూతన సదుపాయాలు చేయలేదు. విద్యాలయాలలో మ్యాపులు లేక, ఉపాధ్యాయుల కొరతతోను, లైబ్రరీ లేబరీటరీ వసతులు లేక పరిస్థితులు అధ్వాన్న స్థితిలోనున్నవి. మంత్రివర్గం వీటిని గుర్తించినట్లులేదు. విద్యావ్యాప్తికి కాంగ్రెసు సంస్థ కంకణం కట్టుకొన్నది.

నేడు ప్రజలలో అట్టి విద్యా చైతన్యం అభివృద్ధి అవుతుంటే మంత్రివర్గం సౌకర్యములు కలుగజేయుటలేదు. పైగా ప్రజాకంటకులగు పోలీసులకై బడ్జెటులో ఖర్చు హెచ్చించుతూ విద్యావిధానంపై తగ్గించుట జరుగుతూంది. విద్యార్థుల జీతాలను పెంచి, బీద, మధ్యతరగతి విద్యార్థులను విద్యాలయాలనుండి బయటికి వెళ్ళగొట్టుటకు నేటి మంత్రివర్గం యొక్క పంథా కారణమవుతుంది, ఈపంథాయే "శాంతి" "విధేయతా" అని పోలీసులను విద్యాలయాలలోనికి పంపుటకు దారితీస్తుంది. మంత్రివర్గం కాంగ్రెసుయొక్క పేరు ప్రతిష్టలకు కళంకం జేయకుండుటకు, విద్యావిధానమును రక్షించుటకు యీపంథాను వీడాలి. ఇది ప్రజా ప్రతినిధుల పంథాకాదు. సామ్రాజ్యవాదుల అడ్వయిజర్ల ననుసరించుమార్గం.

రాష్ట్రంలో హైస్కూళ్ళలో కళాశాలలలో సీట్లు సమస్య పరిష్కరింపబడుటకు షిప్టు (Shift) సిస్టమే అమలు జరపాలి. ముందు సంవత్సరమునకు తగినన్ని విద్యాలయాలు నిర్మించాలి. జీతాలు పెంచరాదు. సామ్రాజ్యవాద విద్యావిధానమును రద్దుజేసి దానిస్థానే జాతీయ విద్యావిధానమును అమలుపర్చాలి. పోలీసులు విద్యాలయాలలో ప్రవేశించుటను నిషేధించాలి. ఉపాధ్యాయుల న్యాయమైన కోర్కెలను అంగీకరించాలి. ఈ సూచనలు అమలుజరిపినప్పుడే విద్యాలయాలలో శాంతి, విద్యా, విజ్ఞాన వ్యాప్తి మంత్రివర్గం తమ పాతపంథాను వదలి ఈ సమస్యల పరిష్కారమునకు పూనుకొనవలసినదిగా విజ్ఞప్తి జేయుచున్నాం.

ప్రపంచానికి మార్గ

ఆటలలో సోవియట్ యువతీ యువకులు

వె. వెంకటదాస్

అది ఒక మహాపర్వదినం. ప్రతిసంవత్సరం జూలై నెలలో వస్తుంది సోవియట్ యువతీయువకులు ఈపర్వదినాన్ని ప్రత్యేకంగా ఆటల పోటీలకోసం ఏర్పాటు చేసుకున్నారు. ఆనాడు దేశమంతటా, అన్నివ్యాయామ కేంద్రాల్లోను ఆటలపోటీలను గొప్ప ఉత్సాహంతో, పట్టుదలతో జరుపుతారు లక్షలాది యువతీ యువకులు పోటీలలో పాల్గొని, తమ చాకచక్యాన్ని, నైపుణ్యతను ప్రదర్శిస్తారు. లక్షలాది యువతీయువకులు గొప్ప పట్టుదలతో ఆటల పోటీలలో పాల్గొనడానికి కారణం ఏమిటి?

ప్రభుత్వ ప్రోత్సాహం

ఆటలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొంది ఉన్న అవకాశాల నన్నిటినీ పూర్తిగా వినియోగించి, శారీర పాటవం గలిగిన యువతీ యువకులను తయారుచేస్తోంది


జాతీయవికాసానికి విద్య ఎంత అవసరమో శారీరకశ్రమ, వ్యాయామం అంత అవసరం, అనే మహదాశయంతో సోవియటు ప్రభుత్వం గత 20 సంవత్సరాలనుండీ పనిచేసి జయం పొందింది. వ్యాయామం అనేది ఒక జాతి నినాదంగా ప్రచారంచేయబడుతోంది. యువతీ యువకులు విద్యాలయాల్లో ఉన్నా, పరిశ్రమల్లో ఉన్నా, సమిష్టి వ్యవసాయ క్షేత్రాల్లో పనిచేస్తున్నా మానసిక, శారీరకాభివృద్ధి అత్యంత అవసరం. ఈఅభివృద్ధికోసం సోవియట్ ప్రభుత్వము ప్రత్యేక శ్రద్ధతీసుకొని ఆర్థిక సహాయ సంపత్తులను చేకూర్చుతుంది. యువతీ యువకుల అభివృద్ధికోసం సోవియట్ మంత్రులే స్వయంగా బాధ్యత వహిస్తారు, కోట్లకొలది రూపాయలను వెచ్చించి, పెద్ద పెద్ద ఆట స్థలాలను ఏర్పర్చి పరికరాలను శాస్త్రోక్తమైన పద్ధతులమీద నిర్మించింది. ఈనాటికి 600 ఆటల పోటీలు జరిపే కేంద్రాలలో 14,000 రోజువారీగా ఆటలాడే స్థలాలను ఏర్పరచిందంటే, సోవియట్ ప్రభుత్వం ఆటల యెడ ఎంత ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నదీ స్పష్టమవుతోంది ఇంకా 3500 కసరత్తు కేంద్రాలను, 3000 మంచుమీద ఆడేప్రదేశాలను, 350 నీటిలో ఆటలాడే కేంద్రాలను సమస్త పరికరాలతో నిర్మించి ప్రభుత్వమే పోషించుతోంది. యుద్ధకాలంలో నాజీలు ఎన్నో ఆటస్థలాలను మిలిటరీ కేంద్రాలుగా వాడుకొన్నారు కొన్నిటిని నాశనం చేశారు నాశనమైన వాటన్నిటినీ బాగుచేయటం, కొత్తవాటిని నిర్మించడంకోసం ప్రభుత్వం లోగడకంటె 4 రెట్లుఎక్కువ డబ్బును ఖర్చు పెడుతోంది. ఈ సంవత్సరం 4,50,00,000 రూపాయలను ఖర్చుపెట్టడానికి ప్రభుత్వం అనుమతించింది ఇంత ప్రోత్సాహము ఉండంవల్లనే, కళకళలాడే ముఖాలతో నూతనత్వాన్ని నిరూపించే శరీర పాటవంతో లక్షలాది యువతీ యువకులు ఆ మహా పర్వదినంనాడు ఆటపాటలలో ఆనందంగా పాల్గొంటారు.

ఇతర దేశాలలోవలె సోవియట్‌లో కాలం వెళ్ళబుచ్చడానికే ఆటలు పెట్టడం లేదు వ్యాపార దృష్టితో అసలేకాదు. లాభాలు తీయాలనేది మచ్చుకైనాలేదు। సోవియట్‌లోని ఆటలన్నీ మంచి ఆరోగ్యకరమైన పునాదుల మీద ప్రవేశపెట్టబడ్డాయి, అందువల్లనే సోవియట్ యువకులు ఆటలలో పట్టుదలతో ఉత్సాహంగా పాల్గొంటారు.

అనేక వందల కేంద్రాలను యువజన సమితులు, కార్మిక సంస్థలు, సమిష్టి వవ్యసాయ క్షేత్రాలే స్వయంగా నడుపు కొంటున్నాయి. 9 ఆటల విశ్వవిద్యాలయాల ద్వారా ప్రతిసంవత్సరం 10 వేలమంది బోధకులను తయారు చేస్తోంది 6 వేలమంది డాక్టర్లు ఆటల టెక్నీషియన్లుగా శిక్షణ పొందారు.


జాతీయ ఆటలపై ప్రత్యేకశ్రద్ధ

ప్రభుత్వ ప్రోత్సాహంతోపాటు యువతీ యువకులు ఇనుమడించిన ఉత్సాహంతో ఆటలలో పాల్గొని తమ శరీరపాటవాన్ని పెంపొందించుకొంటున్నారు. సమిష్టిఆటలను ఆడడం సోవియట్ యువతీ యువకులకు ఎక్కువ ఇష్టం ఇతరదేశాల ఆటలకంటె తమజాతీయ ఆటలను ఎక్కువగా ప్రేమిస్తారు. వాటిని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆటలశాఖ ఎన్నో నూతనపద్ధతులను కనిపెట్టింది. క్రొత్తపద్ధతులద్వారా, శైశవ దశనుండీ ఆటలలో పాల్గొనాలి అనే అభిరుచిని కలుగచేస్తున్నారు. ఈనాడు 9,34,000 మంది మంచుమీద నడిచే పోటీలోను, 3,00,000 మంది రోజువారీ కసరత్తు కార్యక్రమంలోను 4,32,000 మంది మైలుపరుగువగయిరాపోటీలలోను. 70,000 మందిఇతర పోటీలలోనునిత్యం పాల్గొంటున్నారు. పై లెక్కలను బట్టి యువతీ యువకులు ప్రత్యేక శ్రద్ధ వహించి, భావిసమాజ వికాసంకోసం యే విధంగాపునాదులు వేస్తున్నదీ అర్థమవుతుంది. నూతన పంచవర్ష ప్రణాళిక ద్వారా ఇప్పటికి ఆటలలో పాల్గొన్న యువతీ యువకుల సంఖ్యకంటె ఎన్నో రెట్లమంది పాల్గొనాలి అనే దృఢసంకల్పంతో పనిచేస్తున్నారు ఆసంకల్పంవల్లనే ఆట స్థలాలు లక్షలాది యువతీ యువకులతో చూడ ముచ్చటగా ఉంటాయి నిత్యం ఒకకోటిమంది ఏదో ఒక ఆటలకార్యక్రమంలో నిమగ్నులై ఉంటారు. గొప్పనిపుణతను సంపాదించి ప్రపంచంలో



సోవియట్ ఆటల ప్రదర్శనం

దర్శకులు



వ్యాయామంలో తరిఫీదు పొందిన రష్యా సైనిక యువకులు

— ఫొటో : టాస్

ఒక ఉన్నతస్థానాన్ని ఆక్రమించుతున్నారు.

మన యువకుల స్థానం ?

సోవియట్‌లో యువతీ యువకులు ప్రపంచంలో ఒక ఉన్నత స్థానాన్ని ఆక్రమించిన యీ దశలో, మన హిందూదేశ యువకులు చాల వెనుకబడియున్నారు. ఈ పెట్టుబడిదారీ సమాజంలో చాలీచాలని తిండితో, కృశించిన దేహాలతో, నికృష్ట జీవితాన్ని గడుపుతున్నారు సోవియట్‌లో నూటికి 20 మంది ఆటల పోటీలలో ఉత్తీర్ణులైతే, మన దేశంలో ఉత్తీర్ణులు లేకపోగా, కోటికిఒకరుకూడా ఆటలలో నిపుణతను పొందినవారు లేరు అంటే ఆశ్చర్యం కాదు. ఉదాహరణకు మన ఆంధ్ర దేశంలో ఎత్తు దూకడంలో సరాసరి ఎత్తు 3½ అడుగులైతే, సోవియట్‌లో 4½ అడుగులుంది. పొడుగు దూకటం ఇక్కడ 11 అడుగులైతే, అక్కడ 16 అడుగులు. అలాగే మైలుపరుగు ఇక్కడ 7 నిమిషాలైతే అక్కడ 5 నిమిషాలు. ఇంత వ్యత్యాసానికి కారణం ఏమిటి ? 200 సం.నుండి మనలను పాలిస్తున్న బ్రిటిష్ ప్రభుత్వం మనకు తగిన ప్రోత్సాహం ఇవ్వడంలేదు ఎక్కడైనా యువకులు తమ సంఘాలద్వారా శారీరకాభివృద్ధికి పాటుపడుతుంటే నిషేధాలమీద నిషేధాలు అమలు జరుపుతుంది. సోవియట్‌లో సోషలిస్టుప్రభుత్వం వృద్ధియే జాతీయ వికాసం అనే మహత్తర ఆశయంతో పనిచేస్తోంది అందువల్లనే పెట్టుబడిదారీ సమాజంలో ఉన్న యువతీ యువకులకు, సోషలిస్టు సమాజంలో ఉన్న యువతీ యువకులకు జీవిత పరిమాణం మొదలుకొని మిగతా అన్ని విషయాలలోను వ్యత్యాసం కనబడుతోంది సోషలిస్టు సోవియట్ దేహదారుఢ్య పోటీలలో 1938 లోనే 49,78,000 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 5,10,000 మంది స్త్రీలే!

గొప్పనైపుణ్యాన్ని అలవర్చుకున్నారు

శారీరక పాటవాన్ని అభివృద్ధిచేయడంవల్ల పోటీలలో పాల్గొనాలి అనే కాంక్ష ఎక్కువ కావడం సహజం అందువల్ల ఎంతోమంది నిపుణులు తయారవుతారు. గొప్ప రికార్డులు సంపాదిస్తారు. కాని సోవియట్ యువతీ యువకులు కొద్దిమంది నిపుణలతో సంతృప్తి చెందరు. ఒకరిద్దరు నిపుణులు గొప్పపేరు సంపాదించినా వారు గర్వపడరు. మొత్తం యువతీ యువకుల నిపుణత పెరగడం వారి పరమావధి అన్ని ఆటలపోటీలలోను ప్రపంచ మొత్తంమీద మొదటివారుగా రావాలని ప్రయత్నం చేస్తున్నారు. కొన్నిటిలో జయం పొందారు ఇటీవల జరిగిన ప్రపంచ పోటీలలో 400 మీటర్లు ఈత పోటీలో సోవియట్ యువకులు [illegible]

నీకా నిరుద్యోగం?

రెండే రెండు
శతాబ్దాల
మడతల్లో
కూడుకోసం
గుడ్డకోసం
జీవితావసర
వస్తువుకోసం
అలమటించే
పరితపించే
యువకుని
రుధిరం
పీల్చిందీ
బ్రిటిషు
ఉగ్రవిషోరగరీ —
నవయుగ
రూపురేఖల్లో
అవిజ్ఞాన
బానిసత్వ
బ్రిటిషు
ఛటాచ్ఛాయలో
విజ్ఞానం వెదజల్లే
ఉపాధ్యాయ ! నీకా నిరుద్యోగం ? —
నా తండ్రి
హలము బట్టి
పొలము పోయి
గడియించిన
గౌరవార్థం
విద్యా విజ్ఞానాలకై
వినియోగించిన
బానిసత్వ
విద్యాఘోష
వినబడుతూందీ
విద్యావరణంలో —
సంవత్సరం
అసంపూర్తిలో
డిటెన్షన్
రక్కసి
ఒడిలో
పడి; మిగిలిన
విద్యార్థుల
శ్రమ డిగ్రీ
వికలాంగియై
వికటాట్టహాసం
నృత్యంచేస్తోంది;
విద్యార్థీ. నీకా నిరుద్యోగం ?

★ ★ ★ అజ్ఞాతవీరుని పిలుపు

"ప్రవాసి"

నేనే తెలుగువాణ్ణి! మూడుకోట్ల బానిసల్లో ఒకణ్ణి తెలంగాణా వాణ్ణి! నిజామాంధ్ర. మహాసభలో ఒక సభ్యుణ్ణి దివ్యచరిత్రను నిర్మించుతూన్న నల్లగొండజిల్లా మాది.

పేరడుగబోకండి! వూరడుగబోకండి! ఊరూ పేరూ తెలియనివాణ్ణి! నైజాం నవాబు కర్కశత్వానికి బలిఅయినవాణ్ణి! బ్రిటిషు మర తుపాకీకి ఆహుతి అయినవాణ్ణి! నా గాథ విని కన్నీరు కార్చకండి. పౌరుషం తెచ్చుకోండి! తెలుగుజాతి పరువు నిలబెట్టండి.

ఏడాదినాటి క్రితం మాట, అది ఆకునూరు గ్రామం. హరిజనపల్లె

పోలీసులొచ్చారు. దుకాణంలో తాగారు, తందనాలాడారు. లంచాలివ్వమన్నారు. కోడి పెట్టలివ్వమన్నారు.

"లంచమివ్వం, వెట్టిచేయం" అన్నారు ఆ పల్లె ప్రజలు,

"మాదిగవాళ్ళ కింత పొగరు? దొక్క చించుతాం" అంటూ పోలీసులు ఎగిరారు. హింసించసాగారు, జనం బుద్ధిచెప్పి సాగనంపారు.

పోలీసువాళ్ళు పగబట్టారు తిరిగి ఆకునూరు వచ్చారు. ఈసారి ఆయుధాలతో ఆఫీసర్లతో వచ్చారు. పగబూని మరీ వచ్చారు.

మగవాళ్ళను పిలిపించారు. అరెస్టుచేశామన్నారు. కొట్టారు, చెట్లకు కట్టారు. గుంజలకు కట్టారు.

ఇండ్లల్లో దూరారు. గోలెడుతున్న స్త్రీలను నీచంగా తిట్టారు. ఏడ్చుతున్న పిల్లలను తల్లులచంకలనుండి లాగివేశారు. భర్తల యెదుటనే భార్యలను మానభంగం చేశారు.

పైపెచ్చు మగవాళ్ళపై కేసులుపెట్టారు. దొంగతనాలు ఆచోకీతీయడానికి పోలీసులు వచ్చారట. సోదాలుచేస్తుంటే హరిజనులు అడ్డగించారట దౌర్జన్యాలు చేశారట. అందుకు అరెస్టులు, కేసులు - పోలీసులు కక్షతీర్చుకొన్నారు

కాని పాపం పండింది. సంఘం వచ్చింది. సంఘంవచ్చాక ప్రపంచంకండ్లు మూయడం సాధ్యంకాదు నిజం బయటపడింది. ఆకునూరు అమ్మలకు జరిగిన అవమానం అందరికీ తెలిసింది,

ఎంత ఘోరం! అని భారతీయులంతా నిట్టూర్పు విడిచారు. ఆంధ్రదేశమంతా కన్నీరు కార్చింది, "వాళ్ళ జిమ్మడ! ఆ మాయదారాళ్ళు యెప్పుడు నాశనమౌతారో!" అని తెలుగు తల్లులు శపించారు.

నేను నిట్టూర్చలేదు. కన్నీరు కార్చలేదు. పౌరుషం తెచ్చుకున్నాను నావలెనే అనేక మంది తెలంగాణా ప్రజలు పౌరుషం తెచ్చుకున్నారు. ఈ దుండగాలిక సాగనివ్వమని శపధంచేశారు. అందులో నేనొకణ్ణి!

పైన భారత భూమిని చెరబట్టిన బ్రిటీషు వాళ్లు వాళ్లక్రింద నైజాంనవాబు నిరంకుశత్వం, వానిక్రింద లంచగొండి వుద్యోగులు! వాళ్లక్రింద దేశముఖుల దోపిడి! వారిక్రింద రౌడీమూక దౌర్జన్యాలు. ప్రజల జీవితాన్నే వీళ్లు తమ గుప్పిటలో పెట్టుకున్నారు. ఇవన్నీ తెలంగాణా నరకకూపానికి సోపానాలు, ఈ నరకయాతనలను తరతరాలనుండీ తెలంగాణా ప్రజలు మోసేరు, జమీందారీ దోపిడి ప్రజలను నలిపి వేసింది,

ఆంధ్ర మహాసభ వచ్చింది. గ్రామగ్రామాన సంగాలు వెలిసాయి, తెలంగాణా జనం మేల్కొన్నారు. వెట్టిచాకిరీ మానివేశారు. లంచాలివ్వ నిరాకరించారు.

తొలకరించగానే రైతు వెట్టికి దేశముఖి పొలం దున్నడంలేదు ఉద్యోగులకు లంచమివ్వడంలేదు కోమటి ఉచితంగా సప్లయిలు అందించటంలేదు.

వెట్టికి చాకలి దేశముఖు మురికి కడగడం లేదు. ఉద్యోగుల మూటలు మోయడంలేదు

మంగలి కాళ్ళు పిసకడంలేదు, దేశముఖుల దున్నపోతుల బొచ్చు గొరగడంలేదు, గొర్రెపోతుల జుట్టు వెట్టికి కత్తిరించడంలేదు.

కుమ్మరి ప్రతి ఫలంలేకుండా కుండలు యివ్వడంలేదు

ఉచితంగా కంబళ్ళు తేవడంలేదు సాలీ చాపులు అందించటంలేదు. ప్రజలు అక్రమ పన్నులు, వసూళ్ళు లంచాలు మానేశారు.

"మేం మనుషులం! నీబాబుకు అచ్చివున్నామా? వెట్టి చేయం! లంచాలివ్వం!" అన్నారు ప్రజలంతా!

సంగం తెలంగాణా ప్రజలలో కలిగించిన చైతన్యమది ప్రజలుచేసికొన్న కట్టుబాట్లు అవి.

దీనితో అధికార్లు బెదిరారు. దేశముఖులు, జమీందార్లు, జాగీర్దార్లు ఖీతిల్లారు, అనువాతిగా వస్తున్న తమ దోపిడీ సాగదనుకున్నారు. నిరంకుశ జాగీర్దారీ ప్రభుత్వం తనకు మూల స్థంభాలుగావున్న జమీందారుల, జాగీర్దారుల పునాదులే కదిలి పోతున్నవని బెదిరింది.

రౌడీ మూకలను మేపారు; తాగించారు, ఆయుధాలిచ్చారు, ప్రజలపై దాడికి పంపారు.

అలా జరిగిన మొట్టమొదటిది కడివెండి కాల్పులు. 200 మంది రౌడీ మూకకు విసునూరు దేశముఖు కత్తులిచ్చాడు అధికార్లు తుపాకులు సప్లయిచేశారు. ఆ మూక ఆకస్మికంగా కడివెండి గ్రామంపై బడింది.

సాయుధులైన రౌడీమూక ఒకవైపు. నిరాయుధులైన రైతు యువకు లొకవైపు కష్టజీవి అమరయ్య తుపాకిగుండ్లకు బలయ్యాడు "ఆంధ్రమహాసభకు జై!" అంటూ ప్రాణాలు విడిచాడు.

ఈ కబురు గ్రామాలకు ప్రాకింది. ప్రజా హృదయంలో తుపాను లేచింది బడబానలం ప్రజ్వరిల్లింది చేతికందిన కర్రలు, వడిశెలలతో ప్రజానీకం కదిలింది కడివెండి చేరింది దేశముఖు బలగాన్ని ఎదిరించింది

రౌడీమూకను చుట్టుముట్టింది తుపాకి గుండ్లను లెక్కచెయ్యలేదు. జమీందారీ మూకను చితుకగొట్టింది. తరిమివేశారు.

ఆ వెల్లువలో నేనొక అలను! ఆ మహోద్యమంలో నేనొక అణువును!

వెట్టి కట్టుబడింది. లంచాలు ముట్టడం లేదు, జమీందారీ రౌడీమూకల ఆటలు సాగటంలేదు.

నైజాం ప్రభుత్వం ఇక ప్రత్యేకంగానే దేశముఖుల దుర్మార్గాన్ని నిలబెట్టడానికి పూనుకొంది. రిజర్వు పోలీసులను గ్రామాలపైకి దాడికి పంపింది.

కడివెండిలో నిలబడి పోరాడిన వీరులు 'ధర్మాపురం' రైతులు! ధర్మాపురం గ్రామం పైకే రిజర్వు పోలీసుల మొదటి దాడి!

"జై ఆంధ్ర మహాసభకు జై" అంటూ రైతాంగం కదిలింది. ప్రజా బలగం తయారయింది,

రైతులకిది జన్మస్థానం. న్యాయంవారిపైపు వుంది. అదీగాక వారికిది చావు బ్రతుకుల సమస్య. వెనుకంజ వేస్తే దేశముఖుల రౌడీ మూకమరల విజృభించుతుంది మిగిలిపోయిన రైతుల పొలాలను గూడ దేశముఖు కాజేస్తాడు. వారు చెమటోడ్చి పండించిన పంటలు వారికి దక్కవు, వారి స్త్రీల గౌరవం దక్కదు.

రిజర్వు పోలీసులకు ఎదురుగా ప్రజాబలగం నిలచింది. పోలీసులు కదం తొక్కారు; ప్రజలిటు కదం తొక్కారు. పోలీసులు తుపాకులు చూపించారు. ప్రజలు జంకలేదు. ప్రజా సైన్యాన్ని చూసి పోలీసులే వెనుకంజవేశారు.

కడివెండి, ధర్మాపురం మార్గం చూపించినవి. గ్రామ గ్రామాన ప్రజా రక్షణ దళాలు వెలిసాయి. ఆ దళాలలో నేనొక సైనికుణ్ణి.

* * *

రిజర్వు పోలీసుల ఆటలు సాగడంలేదు. ప్రజలను కాల్చి చంపి, అణచుటకు నైజాం ప్రభుత్వం పూనుకుంది.

తెలతెల్లవారుతూంది, రిజర్వు పోలీసులు బాలేముల గ్రామాన్ని చుట్టివేశారు, పొలాలకు పోతున్న స్త్రీ, పురుషులను బాధించసాగారు.

6 గురు ప్రజాసైనికులు వెంటనే 25 మంది పోలీసులను ఎదుర్కొన్నారు. పోలీసులు తుపాకులు కాల్చారు. అనంతరెడ్డి, మట్టారెడ్డి పోరాడుతూ వీరమరణం చెందారు, జమాల్ సాహెబ్ వగైరాలకు గాయాలు తగిలాయి.

ఇంతలో తమ బిడ్డలను రక్షించుకోడానికి గ్రామ ప్రజలు పూనుకున్నారు. చేతికందినవి పుచ్చుకున్నారు. సాయుధ పోలీసులతో ఢీకొన్నారు. ఆ పిరికిపందలు పిక్కబలం చూపారు.

బాలేముల పోరాటం నల్లగొండ ప్రజా పోరాటంలో ఒక కొత్తమెట్టు. ప్రజలు ప్రాణాలర్పించారు. సాయుధ పోలీసులను తరిమివేశారు.

రిజర్వు పోలీసు నిరుపయోగమయింది. తిరిగి నైజాం నవాబు మిలటరీ దళాలను గ్రామాలపైకి పంపాడు.

పాత సూర్యాపేట చిన్న గ్రామం. దేశభక్తిగల ప్రజలు; ఆంధ్రపౌరుషం నిలబెట్టిన వీరులు

ఆ చిన్న గ్రామంపైకి 500 మిలిటరీ దాడి చేసింది. తుపాకులు కాల్చారు; టియర్‌గాస్ బాంబులు వేశారు. నరసయ్యను బలిగొన్నారు. అనేకమందిని గాయపరచారు. 150 మందిని అరెస్టుచేసి తీసుకుపోయారు.

మిలిటరీతో 1000 మంది ప్రజలు గంటసేపు నిలబడి పోరారు. మిలిటరీ దాడివార్త తెలిసి చుట్టూ గ్రామాల ప్రజలు 6 వేలమంది ఆ గ్రామానికి పరుగుపరుగున వచ్చారు. చుట్టుముట్టిన సైన్యానికి చుట్టువలయాకారంగానిల్చి ప్రదర్శనం చేశారు.

“జమీందారీ నిరంకుశత్వాన్ని తుదముట్టించాలంటే, మన ఆస్తిపాస్తులను రక్షించుకోవాలంటే, మన స్త్రీల మానాలను కాపాడుకోవాలంటే, మనం ఏమైనాసరే ఎదిరించి పోరాడాలి” అన్నారు.

ఆ నినాదం నల్లగొండజిల్లా అంతటా ప్రతిధ్వనించుతోంది. తెలంగాణా ప్రజల హృదయాలలో స్పందించుతూంది. ముక్కోటి ఆంధ్రుల చెవులలో గింగురుమంటోంది!

* * *

తరువాత అనేక గ్రామాలపై మిలిటరీ దాడులు జరిగాయి; అనేకమంది తెలుగువీరులు నేలకొరిగారు; అనేకమంది గాయపడ్డారు. అవన్నీ నేనిక్కడ ఏకరువుపెట్టను. రెండు ఉదాహరణలు మాత్రం చెప్పి వదలివేస్తాను.

పులిగిల్ల భోనగిరి తాలూకాలోని గ్రామం. జాగీరు గ్రామం. ప్రజలు సంగం పెట్టుకున్నారు. వెట్టి చెయ్యడం, లంచాలివ్వడం మానివేశారు. ఇందుకు నైజాం సాయుధ పోలీసు ఆ గ్రామంపై దాడిచేసింది.

సంకుల సమరంలో ముగ్గురు ప్రజా సైనికులు నేలకొరిగారు. అనేకమందికి గాయాలు తగిలాయి.

ప్రజలు పోలీసులను చితుక గొట్టారు. ముగ్గురు పోలీసులు, ముగ్గురు జాగీరు వుద్యోగులు మరణించారు. మరికొందరికి గాయాలు తగిలాయి. ప్రజలు కక్షతీర్చుకున్నారు.

హుజూరునగర్ తాలూకాలోనిది మల్లారెడ్డిగూడెం. ప్రజలను దోపిడిచేస్తున్న పెత్తందార్లు తమ పెత్తనం నిలబెట్టుకోడానికి మిలిటరీని ఆహ్వానించారు.

మరతుపాకులతోవున్న మిలిటరీని ప్రజలు వడిసెలలతో యెదిరించారు. మహిళలు రాళ్ళు అందించారు.

3 గంటలు హోరాహోరిగా పోరాడారు. ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు, ప్రజాసైనికులు వీరశయనం పొందారు.

ఆకునూరులో హరిజన మహిళలకు జరిగిన అవమానాన్ని, కష్టజీవులైన గురవమ్మ, తొండమ్మ, అంకాళమ్మలు తమ రక్తంతో కడిగివేశారు.

ఇలా ఎన్నో వూళ్ళమీద మిలిటరీదాడులు జరిగాయి! జరుగుతున్నాయి! సోదరులు, సోదరీమణులు హతులవుతున్నారు, గాయపడుతున్నారు.

అలా గాయపడినవారిలో నేనొకణ్ణి! నా పేరడుగబోకండి! వూరడుగబోకండి! పేరూ వూరూ తెలియనివాణ్ణి! నాకొరకు కన్నీరు కార్చబోకండి! పౌరుషం తెచ్చుకోండి!

* * *

నాకూ భార్యవుంది. పిల్లలున్నారు. నేను వాళ్ళను ప్రేమించుతున్నాను. వాళ్ళు నన్ను ప్రేమించుతున్నారు. కాని మేము సుఖమనుభవించింది లేదు. కడుపునిండా తిండిలేదు; ఒంటినిండా బట్టలేదు.

మాకు తెలుగు తల్లిచ్చిన భూమివుంది. చెమటోడ్చి పండించాం. కాని ఆ పంట మాకు దక్కలేదు,

ఉద్యోగులు కాజేశారు! దేశముఖు కాజేశాడు! నైజాం నవాబు కాజేశాడు! మాకు మిగిలింది ఆకలిచిచ్చు!

సంగం వచ్చింది, ఆ చిచ్చులో అగ్గిరవ్వ పడింది, విప్లవాగ్ని లేచింది.

తెలుగు వీరుడు సీతారామరాజు పెట్టిన ఒరవడి వుంది. ఆంధ్రమహాసభ చూపుతున్న మార్గం వుంది. కమ్యూనిస్టు అన్నలు నడుపుతున్నారు. ఆ తెలుగుజోదుల సైన్యంలో నేనొకణ్ణి! పోరాడాను! గాయపడ్డాను!

గాయాలకు సరియైన మందుల్లేవు. కుళ్ళిపోతున్నాయి పోటుపుడుతున్నాయి. కంపు కొడుతూంది.

కుళ్ళి చనిపోతున్నానని నేను విచారపడటంలేదు నాజాతి గౌరవం నిలిపానని గర్వపడుతున్నాను.

నా భార్య నులివెచ్చని కౌగిళ్ళు అనుభవించాను! నా బిడ్డల ముద్దులు అనుభవించాను! నేడు వారిని ఒదిలిపోతున్నాను.

నాభార్యకోసమే పోరాడాను! ఆమెలాంటి తెలుగుతల్లుల మాన మర్యాదలు కాపాడటానికే పోరాడాను. నా బిడ్డలకోసమే పోరాడాను. నా బిడ్డల్లాంటి కోట్లకొలది తెలుగుబిడ్డల భావి సౌఖ్యంకోసమే పోరాడాను.

నాలాగే తెలంగాణాలో, నల్లగొండ జిల్లాలో అనేకమంది పోరాడుతున్నారు, పేరూ-వూరు తెలియనివాళ్ళు అనేకమంది ఆహుతి అవుతున్నారు, ఉద్యమాన్ని, సంగాలను కాపాడుకొంటున్నారు. బానిసత్వాన్ని రూపుమాపి, స్వేచ్ఛా సౌఖ్యజీవితం గడపడానికి స్వతంత్ర ప్రజారాజ్యాన్ని స్థాపించడానికి ప్రతినబూనారు. స్వాతంత్ర్య పోరాటంలో నూతన సాంప్రదాయాలు సృష్టించుతున్నారు. తెలుగుజాతికి దివ్యచరిత్ర నిర్మించ బడుతూంది.

నాపేరూ వూరూ అడుగబోకండి! నాకోసం కన్నీరు కార్చకండి! పౌరుషం తెచ్చుకోండి! తెలుగుజాతి పరువునిలుపండి!

ఈ దురంతాలు సరికట్టాలి

బందరు ప్రిన్సిపాలు కసాయి చర్యలు

జి. జగన్నాధరెడ్డి

బందరు హిందూ కాలేజీ ప్రిన్సిపాలు కాజ శివరామకృష్ణరావుగారి దురంతాలు ఆంధ్ర ప్రజలకు విద్యార్థులకు తెలియనివికావు. డిటెన్షన్లకు వ్యతిరేకంగా సమ్మెజేసి తమ అభిప్రాయములను వ్యక్తపర్చ సాహసించినందుకు విద్యార్థులందరిపైనా జరిమానాలు విధించాడు. విద్యార్థుల ఐక్య పోరాట ఫలితంగా దిగివచ్చి జరిమానాలు రద్దుచేసుకోవలసి వచ్చింది. ఇది యీయనగారి జీవితంలో ప్రధమ పరాజయం. కాని అప్పటినుండి విద్యార్థులలో వచ్చిన యీ ఐక్యతను, చైతన్యమును ఎప్పుడు కాలరాయగలనా అని ఆలోచనలు జరుపుచునేయున్నాడు విద్యార్థి హక్కుల రక్షణకు విద్యార్థి ఫెడరేషన్‌తో కలసి పనిచేయ నిరాకరించిన విద్యార్థి కాంగ్రెసు నాయకుల పంథా పిన్సిపాలుకు చక్కని సావకాశమిచ్చింది.

విద్యార్థుల ఐక్యత లేకుండా జరిగిన రెండవ సమ్మెలో విద్యార్థులం ఓడిపోయాం. ప్రిన్సిపాలు రొట్టె నేతిలో పడ్డది. విద్యార్థుల యీ బలహీనతను అనువుగా తీసుకొని వందల కొలది విద్యార్థి జీవితాలను పొట్టన బెట్టుకొన్నాడు. ఒక్క ఇంటర్మీడియట్‌లోనే 50మందిని పూర్తిగానూ, 150 మందిని భాగములలోనూ డిటెయిన్ చేసినాడు ఇవి చాలవన్నట్లు పరీక్షలకు చదివి తయారయి వచ్చిన విద్యార్థులకు చివరిరోజున హాలు టిక్కెట్లు యివ్వ నిరాకరించాడు. ప్రిన్సిపాలు యొక్క ఈ కసాయి కోతకు ఫస్టు క్లాసులో ప్యాసగునట్టి విద్యార్థులనేక మంది బలి అయ్యారు నేటికి 29 మందిపై కేసు నడుస్తున్నది. కేసు ఫలితాలను జూసి వీరి జీవితాలను విచ్ఛిన్నంజేయ చూస్తున్నాడు. ప్రిన్సిపాలు యొక్క యీ అమానుష చర్యలు జిల్లా ప్రజలను కలవర పరచు తున్నాయి విద్యార్థి లోకంలో తీవ్రఅసంతృప్తిని వ్యాపింప జేసాయి, అయినా ప్రిన్సిపాలు తన కసాయిచేష్టలు మానలేదు. ముందు లిస్టులు కట్టవలసిన జూనియర్ క్లాసు విద్యార్థులపై నేడు ప్రిన్సిపాలు కబంధ హస్తం పడనున్నది 1, 3 వత్సరం విద్యార్థులను వందల సంఖ్యలో డిటెయిన్ జేయుటకు లిస్టులు తయారు జేయుచున్నాడు. మార్కులలో ఊచకోతకోసినా తప్పించుటకు వీలులేని వారికి హాజరు పట్టీలో మార్పులు జేయుచున్నాడు. రానున్న సంవత్సరం కళాశాలలో ఒక విద్యార్థినిని గూడ జేర్చుకొనననీ, ఇప్పుడు ఉన్నవారినెల్ల డిటెయిన్ చేసివేస్తానని అనుయాయులతో చెప్పుచున్నాడు.

కాలేజీ కమిటీ, ప్రిన్సిపాలుకు తాళం వేస్తుంది విద్యార్థులు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా ఫలితం సూన్యమయింది. బందరు ప్రిన్సిపాలుయొక్క అమానుషచర్యలను అరికట్టుటకు కదలి ఆందోళన చేయమని జిల్లాలోని తలిదండ్రులకు విజ్ఞప్తిచేయుచున్నాం జిల్లాలోని ఫస్టుగ్రేడు కళాశాల యిది ఒకటే. ఇచ్చట నేటిపరిస్థితులను సాగనిచ్చుట అనిన మన ప్రజల ఉన్నత విద్య దెబ్బతినకమానదు. కనుక విద్యావిషయంలో పరిస్థితులను చక్కబరుచుటకు, విద్యార్థుల, ప్రజలుకదలాలి. బందరు ప్రిన్సిపాలును ఉద్యోగంనుండి తొలగించమని ఎలుగెత్తి చాటాలి. ప్రిన్సిపాలు, కమిటీలచర్యలను అరికట్టుటకు మంత్రివర్గము కలుగజేసుకొనునట్లు ప్రజాందోళనను నిర్మించాలి అందుకు గ్రామ గ్రామాన సభలు జరుపమని, బందరు ప్రిన్సిపాలు చర్యలను ఖండించమని ప్రజలకు, విద్యార్థియువజన సోదరులకు విజ్ఞప్తి చేయుచున్నాను.

★

గమనిక

"నవయుగ" 1, 2 సంచికలు క్రౌను సైజులో ప్రకటించాం. కాని క్రౌను సైజు 'న్యూసుప్రింటు' సంపాదించుట అసాధ్యంగా నున్నది. అందుచే "డెమ్మీ" సైజుకు మార్చుతున్నాం. ముందుసంచికలన్నీ ఇదే సైజులో ప్రకటించబడుతాయి.

మేనేజరు
— "నవయుగ"

అఖిలభారత విద్యార్థి ఫెడరేషను కౌన్సిల్ సమావేశం

జూన్ 1, 2, 3 కటక్‌లో

సెలవులనంతరం విద్యాలయాలు తెరచునప్పటికి విద్యార్థులను నూతన సమస్యలు ఎన్నో ఎదుర్కొననున్నవి దేశమును విభజించి, సంస్థానములలో తిష్టవేసి భారతదేశ ఆర్థిక జీవితమును తమ గుప్పెట్లో నుంచుకొనుటకు బ్రిటిష్‌సామ్రాజ్యవాదులుకుట్రపన్నుతున్నారు, దేశంలోని ప్రధాన రాజకీయ పక్షనాయకులమధ్య చీలికలనుసామ్రాజ్యవాదులు తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకొంటున్నారు. సామ్రాజ్యవాదుల కుట్రలను విచ్ఛిన్నంచేసి దేశమును అంతిమ పోరాటమునకు సిద్ధంజేయుటలో విద్యార్థులమైన మనపాత్రఏమిటి?

దినదినాభివృద్ధిపొందుచున్న విద్యార్థి వుద్యమంపై సామ్రాజ్యవాదులు తీవ్ర నిర్బంధ విధానాన్నిప్రయోగించుతున్నారు అనేకమంది విద్యార్థి కార్యకర్తలు నిర్బంధింపబడి యున్నారు. ఇట్టి పరిస్థితులలో నేటి నిర్బంధవిధానమును ఎదుర్కొనుట ఎట్లు? మన పౌరసత్వ హక్కులను నిలుపుకొనుటెట్లు?

నేడు భారత విద్యార్థులకు ప్రపంచ విద్యార్థులతో ఏర్పడిన సన్నిహిత సంబంధాలను యింకా వృద్ధి జేయుట ఎట్లు? మున్నగు ఎన్నోముఖ్య సమస్యలను మనం చర్చించి యీకౌన్సిలుసమావేశంలో నిర్ణయములను తీసుకొనవలసి యున్నది. కనుక ప్రతి పట్టణ, జిల్లా విద్యార్థినాయకులు కౌన్సిలు సభ్యులు కాకపోయినా యీ సమావేశమునకు హాజరు కావాలి. ఈ సమావేశం విద్యార్థుల అభివృద్ధికి ఎంతో తోడ్పడగలదు

నేటినుండి మీరు మీడబ్బు మొదలగు ఏర్పాట్లుచేసుకోండి బెజవాడనుండి వెళ్ళి తిరిగివచ్చుటకు 35 రూపాయలు అవసరం. ఆంధ్ర కౌన్సిలు సభ్యులు మే 31 ఉదయం కలకత్తా మెయిల్‌లో బయలుదేరుతారు. ప్రతి కార్యకర్త తన సన్నాహాలను నేటినుండి ప్రారంభించాలి.

యువకుల ఆస్థిహక్కులపై దాడి

రావు కమిటీ బిల్లులో సరిచేయవలసిన లోపాలు

బూజుపట్టిన పురాతన ఆచారాలతో ఎంతో లోపభూయిష్టంగా వున్న హిందూధర్మ శాస్త్రాన్ని కాలానుగుణంగా మార్చి చట్టం చేయడానికి బి యన్ రావు అధ్యక్షతన రెండేళ్ళక్రితం ఏర్పడిన కమిటీ నేటికి తన రిపోర్టును, చేయాల్సిన సవరణలను బయట పెట్టింది 'స్వాతివానకు ముత్యపుచిప్పలవలె' ఎంత అభివృద్ధికరంగా వుంటుందోనని అభ్యుదయ కాముకులంతా ఎదురుచూచారు. కొన్ని అభివృద్ధికర సవరణలున్నా ఆశించినంత అభివృద్ధికరంగా లేదు

ఆర్థికహక్కులు లేక అనేక బాధలకు గురియగుచున్న సోదరీమణులకు ఆస్థిలో హక్కు కల్పించడంతో కొంతవరకు ఆ బాధలుతీరుతాయని అభ్యుదయకాముకులంతా సంతోషిస్తారు. కట్నాలివ్వలేక యమయాతనలు పడే తలిదండ్రులకు యిది కొంత విమోచనని ఆశించవచ్చునేమో !

ఏదేశంలోనూలేని వర్ణభేదాలు మనదేశంలో వర్ణనాతీతంగా వుండటం అందరూ ఎరిగిందే. యువకులు చైతన్యవంతు లవుతున్నకొద్దీ వర్ణభేదాలన్నీ మంట గలసిపోతున్నాయి విద్యాధికులైన యువకులు కొందరు కులమత భేదాలతో ప్రసక్తిలేకుండా పెండ్లిళ్లు చేసుకొని ఆదర్శప్రాయులయ్యారు. కాని చట్టరీత్యారక్షణ లేకపోవడంవల్ల కొంత అడ్డంకిగానే వుంది. నేటి యీరిపోర్టు ప్రకారం పెండ్లికి వర్ణభేదాలు అడ్డురావు ఈ మార్పుకు సమాజ శ్రేయోభిలాషులంతా సంతోషిస్తారు.

ఇలాంటిఅభివృద్ధికర మార్పులకు సంతోషించినా యువకులను విభ్రాంతిపర్చేవిషయ మొకటుంది మనదేశంలో అవిభక్తకుటుంబాల ఆస్తి హక్కు విషయంలో రెండు రకాలైన పద్ధతులున్నాయి ఒకటి బెంగాల్ మొదలైన రాష్ట్రాల్లో "దాయభాగ" పద్ధతి. దీని ప్రకారం తండ్రి బ్రతికున్నంత కాలం ఆస్థిమీద పూర్తి హక్కు ఆయనిదే. తన యిష్టమొచ్చినట్లు ఖర్చుపెట్టుకోవచ్చు. పూర్తిగా అమ్మేసినా మాట్లాడడానికి వీల్లేదు. రెండోది మన ప్రాంతాల్లో అమలులో వున్న "మితాక్షర" పద్ధతి దీని ప్రకారం మనందరకు తెలిసినట్లుగా తండ్రి ఆస్థిలో కొడుకు పుట్టగానే హక్కు వస్తుంది.

మన దేశములో అభివృద్ధికర భావాలుగల తలిదండ్రులున్నా, అభివృద్ధినిరోధక పెత్తం

ఆట్లూరి పూర్ణచంద్ర రావు

దారిమురాలులేకపోలేదు. ఎంతమంది తండ్రులు తమ కొడుకులు చదువుకొని రాజకీయాల్లో పడి చెడుపోతున్నారని చదువు మాన్పించజూస్తున్నారో మనకు తెలుసు. ఎంతమంది తండ్రులు కట్నంకోసం తాము కుదిర్చిన పిల్లనే పెండ్లిచేసుకోవాలని బలవంతం చేస్తున్నారో మనమెరుగుదుం. తమమాట జవదాటతున్నాడనే (ఎంతఛాందసంగావున్నా) నెపంతో యువకుల వ్యక్తిత్వాన్నే అరికట్టచూచే అభివృద్ధి నిరోధకులకు ఈ "దాయభాగ" పద్ధతి ఎంతో అండ, ఇంటివద్ద భార్యా పిల్లలను లెక్కచేయకుండా కొంపలు బట్టుకొని తిరిగి, జూదాలతోను త్రాగుడుతోను ఆస్థులు నాశనం చేసే మహనీయులకు యీ పద్ధతి ఎంతో హుషారిస్తుంది.

ఈపద్ధతి అమల్లోకి వస్తే యిలాంటి వారి కుటుంబం గతేమవుతుంది? ఈరావు కమిటీ దేశమంతా ఒకే పద్ధతి అమల్లో వుండాలని "దాయభాగ" పద్ధతి వుంటే బాగుంటుందని తమ రిపోర్టులో వెల్లడించారు చంపదల్చుకొన్న కుక్కను పిచ్చికుక్కంటే సరిపోతుందన్నారట, వెనుకటి కెవరో మహనీయులు అలా వుంది వీరి రిపోర్టులోని యీ భాగం, లేకపోతే దేశమంతటా ఒకెపద్ధతి అమల్లో వుండాలంటే "మితాక్షర" పద్ధతి (పుట్టినప్పటి నుండే పిల్లలకు హక్కుండే పద్ధతి) నే ఎందుకు అమలు పర్చరాదు? ఇలాంటి అభివృద్ధి నిరోధక సూచనల వల్ల నిత్య దరిద్రంతో, జీవనోపాధి దుర్లభంగా వుండే మనదేశంలో మనకున్న (యువకుల కున్న) యీ కొద్దిపాటి ఆస్థిహక్కు ఎవరి దయాదాక్షిణ్యాలమీదనో ఆధారపడి వుంటుంది. దీనివల్ల ఎంతమంది ఛాందసులకు మన స్వతంత్ర భావాలు ఆహుతై పోవాల్సివుంటుంది? ఈ పద్ధతి ఆచరణలోకి వస్తే యువకులమైన మనకు తండ్రి కిష్టంలేని ఏచిన్న సంస్కరణైనా సాధ్యమవుతుందా? సమాజాభి వృద్ధికి ఆధారభూతులై భావి పౌరులైన యువకుల వ్యక్తిత్వమే నశిస్తే సమాజం ముందుకు పోతుందా? కాబట్టి సమాజాభి వృద్ధిని కోరే ప్రతివారూ వెంటనే మేల్కొవాలి. దేశమంతటా మన "మితాక్షర" పద్ధతే అమల్లో వుండేటట్లు ప్రతి యువకుడూ తీవ్రకృషి చేయాలి.

(8వ పేజీ తరువాయి)

ులు ఇంకా 4 గురు సోవియట్‌లో ఉన్నారంటే; మనకు ఆశ్చర్యంవేస్తుంది. ఫుట్-బాల్ పోటీలో మాస్కో టీము ప్రపంచంలో ఉన్నతస్థానాన్ని పొందింది. ఈవిధంగా సోవియట్ యువతీయువకులు గొప్ప నైపుణ్యాన్ని అలవర్చుకొన్నారు.

ప్రపంచానికే మార్గదర్శకులు

సోవియట్ యువతీ యువకులు ఎల్లప్పుడూ తమ నైపుణ్యతను అంతర్జాతీయ నిపుణత్వంలో పోల్చుకుంటారు. ఆ పోల్చుకోడంలో తమరికార్డులు ఎంతవరకుముందుకు పోయిందీ ప్రతి సంవత్సరం అంచనా వేసు కుంటారు. గత సంవత్సరం 18 దేశాలలో ఆటల పోటీలలో పాల్గొన్నారు. పరుగు, ఎత్తు దూకడం, మొదలగు పోటీలలో మొదటివారుగా వచ్చి, "హ్యూమనేట్-కప్"ను పారిస్‌నుండి గెల్చుకొని తమపేరు నిలబెట్టు కున్నారు.

సోవియట్ యువతీ యువకుల ప్రధాన ఆశయం మాత్రం జాతి నిపుణత్వం పెరిగి మొత్తందేశంలోని స్త్రీపురుషులు, బాలబాలికలు అంతా ముందుకురావాలి, అలా సాధించేవరకు వారు నిద్రపోరు। అక్కడ ప్రభుత్వ ఆశయం కూడ అదే॥

ఆ కళకళలాడే యువతీ యువకుల ముఖాలనుచూచే విశ్వకవి రవీంద్రుడు భూలోక స్వర్గమని, ఆనందంతో పొగిడాడు. !!! మనం మాత్రం వారిని ఆదర్శంగా తీసుకొని యువకులకు సౌఖ్యప్రదమైన జీవితంకొరకు ముందుకు సాగిపోవద్దూ?

భారత స్వాతంత్ర

[మే 10 వ తేదీ 1857 ప్రథమ భారత స్వాతంత్ర్య దినోత్సవం. స్వాతంత్ర్య సముపార్జనకు హిందూ-ముస్లిం ఐక్యపోరాటాలను నడిపిన భారతదేశంలో నేడుహిందూ-ముస్లిం అంతఃకలహాలు చెలరేగుతున్నాయి. మన స్వాతంత్ర్య ఉద్యమ సాంప్రదాయాలను స్మరించి మన కర్తవ్యం నెరవేర్చుటకు తోడ్పడు ఈవ్యాసమును ప్రథమ స్వాతంత్ర్య దినోత్సవ జ్ఞాపకచిహ్నంగా సమర్పిస్తున్నాం. —సంపాదకుడు]

"మన సామ్రాజ్యాన్ని రక్షించుకోవాలంటే తగినంతమంది తెల్లసైనికులు లేకుండా నల్లదేశీయ సైనికుల ప్రభుభక్తిమీద మనం ఆధారపడకూడదు, ఆధారపడలేం" ఇది సర్ చార్లెస్ మెట్‌కాఫ్, 1877 లో గవర్నరుగా ఉన్న అనుభవంతో వ్రాసింది. నిజమే, ప్రభువులు చల్లనివారని, వారిని సేవించటం తాము తరించటమేనని భారతీయ సైనికులు నమ్ముతున్నారని చెప్పటం, ప్రచారం చెయ్యటం, గభీరమైనది గావచ్చుకాని, నిజంమాత్రం కాదు. మన భారతీయ వీర సమర చరిత్రలో, 1920, 1930 జాతీయ పోరాటపు వెల్లువలు రాకపూర్వమే మన సైనికులు సామ్రాజ్యవాదాన్ని తుదముట్టించడానికి తెల్లదొరల పెత్తనంనుండి విముక్తిచెంది తిరిగి భారతీయ స్వేచ్ఛావాయువును పీల్చటానికి అనేక పోరాటాలు జరిపారు. ఆ పోరాటాల ప్రథమ ఘట్టమే 1857 సిపాయిల విప్లవం.

వారన్‌హేస్టింగ్సు (1772–1785) కంపెనీ గవర్నరుగా, దేశాన్ని కొల్లగొట్టటం, తాము చేసుకొన్న సంధులనే పాటించకుండా అక్రమ ధనార్జనకు పూనుకొనటం, భారత దేశాన్ని కంపెనీ అధికారంక్రింద శాశ్వతబానిసదేశంగా చేయాలని ప్రయత్నం చేయటం, దేశమందలి విజ్ఞానులందరూ పసికట్టి, కంపెనీ పరిపాలనకు ప్రతికూలించసాగారు. తర్వాత వచ్చిన గవర్నర్లు, శాశ్వత శిస్తు అనే పేరుతో దున్నే రైతుకు హక్కులేకుండా జమీందారులను, భూస్వాములను ఏర్పరచి తమకు అండగా ఉండి ప్రజలను దోచే విధానాలు ప్రజలపై రుద్దటంతో ప్రజలందరూకూడ కంపెనీ ప్రభుత్వపరిపాలనాన్ని ఏవగించుకొని దానిని అంతంచేయటానికి తయారయ్యారు. దేశం యావత్తూ కరువుకాటకాలతోనూ, అంతర్యుద్ధాలతోనూహోమగుండంగాఉంది. అప్పుడప్పుడే అధికారుల ప్రవర్తన మరీ ఆందోళన కల్గించింది. తెల్లసైనికుల సేవకులు దేశీయ సైనికులు. వారు ప్రభువులు. వీరు బానిసలు. వారికి ప్రత్యేక వసతులు, పంచభక్ష్య పరమాన్నాలు, వీరికి పూటకు తికాణాలేని గంజినీళ్లు. ఈవరసన అవమానంపై అవమానాన్ని సైనికులుభరించలేక స్వేచ్ఛావాయువును పీల్చటానికి ప్రయత్నాలు మొదలెట్టారు.

1855 లో నైజాంప్రభుత్వ మూడవ అశ్వదళంలోని సైనికులు హిందూ-ముస్లిములు కలసి తిరుగుబాటు చేశారు. అంతకుముందే (షుమారు సం॥ 1853) వెల్లూరులో సైన్యం తిరుగుబాటు చేయడం, అది ప్రజాసామాన్యంలోకి కూడ చొచ్చుకుపోయి, చాలకాలంవరకు అప్పటి కంపెనీ వ్యవహర్తఅయిన బెంటిక్ కూడ ఏమిచేయలేని పరిస్థితులను కలిగించటం జరిగింది. ఇట్లా హిందూముస్లింలు స్వేచ్ఛకోసంసల్పిన చిన్నచిన్నతిరుగుబాటులు 1857 సం॥. విప్లవానికినాందిఅయాయి. వీటికి తోడు, నానాసాహెబు, రాణీ ఝాన్సీలకు జరిగిన అవమాన, అన్యాయాలు సైనికులందర్నీ కలవరపరచి, విప్లవంద్వారా కంపెనీ ప్రభుత్వ పతనానికి ప్రయత్నాలు జరిగాయి.

ఈ విప్లవ ప్రారంభం క్రీ. వె. 1857 సం॥ లో మేనెల 10 వ తేదిన మీరట్‌వద్ద ప్రారంభింపబడి, దేశమంతా అలుముకుంది. అక్కడనుంచి సైన్యవాహిని ఢిల్లీనగరాన్ని వశపరచుకొని వృద్ధుడైన బహదూరుషాను చక్రవర్తిగా ప్రకటించింది. కాన్పూరు, లక్నో, ఝాన్సీలలో పోరాటం తీవ్రతరమైంది. కాన్పూరు సైనిక వాహినికి నానాసాహెబ్ నాయకుడై పట్టణం ఆక్రమించాడు లక్నోలోని సైనికులు నిర్మాణయుతమైన నాయకత్వము లేకపోయినా, విజృంభించి పోరాటంలో తెల్ల సైన్యనాయకుడగు హెన్రీలారెన్సునుపరిమార్చి



ఆంధ్రయుగ పురుషుడు వీరేశలింగం వర్ధంతి

మే 27న జరపండి

తన నాటి సంఘంలో వున్న దురాచారాల నన్నిటినీ ఎదిరించి, నూతన సమాజాన్నీ సంస్కృతినీ నిర్మించడం కోసం కృషిచేసిన అభ్యుదయ యుగ పురుషుడు శ్రీ వీరేశలింగంగారు. విద్యార్థుల హక్కులకోసం, విజ్ఞానంకోసం నిరంతరం కృషిచేసి ఆయన విద్యార్థిగాను, ఉపాధ్యాయుడుగాను విద్యార్థుల ఆదరాభిమానాలను చూరగొన్నారు. ఆయన నిత్యసాంఘిక జీవితంలో పాల్గొన్నారు. స్త్రీవిద్యకోసం బాలికా పాఠశాల స్థాపించారు. బాల్యవివాహాది దురాచారాలను ఖండించి, రజస్వలానంతర వివాహాలూ, వితంతువివాహాలూ చేయించారు. 'వితంతు శరణాలయం', 'పతితయువతీ రక్షణాలయం' మొదలైన సంస్థలు నిర్మించారు.

ఇలాకృషిచేస్తూ ఆయన 1919 మే 27 వ తేదీన కీర్తిశేషులైనారు.

కనుక రేపు మే 27 వ తేదీన యువకులూ, విద్యార్థులూ, అభ్యుదయ రచయితలూ, స్త్రీలు కలిసి శ్రీ వీరేశలింగంగారి వర్ధంతిని ఆంధ్రదేశ మంతటా జయప్రదంగా జరపాలని కోరుతున్నాం.

(ఆంధ్రవిద్యార్థి : యువజన మహిళా అభ్యుదయ రచయితల సంఘ కార్యదర్శులు)

రణగర్జన



యస్. టి. రంగాచారి

బాయియే నాయకురాలై తుదిక్షణము వరకు ధైర్యసాహసములతో పోరాడి, రణరంగము నందు ప్రాణాలు విడిచింది. పోరాటపు వెల్లువలలో భారతీయ సైనికులు అందరూ మత భేదములు లేక పోరాడారు. నానాసాహెబ్, రాణీఝాన్సీ, బహదర్షా, ఏమతానికి చెందినా, ఏప్రాంతానికి చెందినా అంతా భారతీయులే. సామ్రాజ్య వాదాన్ని నాశనం చేయాలి అనే దీక్ష కార్యరంగమందు మెరసింది. హిందూసైనికులు ముస్లింసైనికులు అందరూ భాయి, భాయి అంటూ. ఎవరయితే నేమని. బహదూర్‌షానే పీఠంపై

(మిగతా 21 వ పేజీలో)

★ఇండోనేషియా ప్రతినిధుల సందేశం

మీ పోరాటమే మా పోరాటం * * *

* * * మీ విజయమే మా విజయం

సంకుచిత పార్టీ మతాద్వేషాల ఫలితంగా ఆంధ్ర ప్రజలమధ్య ఒక అగాధం యేర్పడింది అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ వారి ఆహ్వానాన్నంగీకరించి భారతదేశ పర్యటన సాగిస్తున్న ఇండోనేషియా యువ ప్రతినిధి వర్గం ఆంధ్ర దేశం వచ్చుటతో తెనాలి, గుంటూరులో అది పటాపంచలైంది. ఐక్య కార్యచరణకు దారి తీసింది. కాంగ్రెసు-లీగు-కమ్యూనిస్టులు ఒకే వేదికపై నిలిచారు. రెండు వేర్వేరు దేశాలకు చెందినా రెండు దేశాల ప్రజలము మనలను దాస్యంలో బంధించి దోచు కుంటున్న సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా పోరాటం సాగించుతున్నాము. ఈ సామ్రాజ్య వ్యాదవ్యతిరేక పోరాటంలో రెండు దేశాల వారం సహోదరుల వంటివారం. ఈ సౌభ్రాతృత్వమే, ఈ లక్ష్యమే మనల నైక్య పరిచింది,

ఐక్య పోరాటం సల్పండి

ప్రతినిధివర్గాన్నాహ్వానించడానికిగాను ప్రతి చోట ఐక్య ఆహ్వానసంఘా లేర్పడ్డాయి. గుంటూరులో కాంగ్రెసు నాయకులు ప్రతినిధి వర్గాని కాతిధ్యమిచ్చారు. లీగ్ నాయకులు తేనీటి విందిచ్చి గౌరవించారు. సాయంత్రం అన్ని పార్టీల తరపున ఐక్య బహిరంగ సభ జరిగింది. సామ్రాజ్య వ్యతిరేక పోరాటం జరుపుతున్న సోదర ఇండోనేషియా దేశ ప్రతినిధుల నాహ్వానించడాని కీవిధంగా భారత దేశపు పార్టీలన్నీ ఐక్యం గావడం ప్రతినిధి వర్గాన్నెంతో ముగ్ధుల చేసింది. ప్రతినిధి వర్గ నాయకుడు, ఇండోనేషియా విద్యార్థిసంఘ అధ్యక్షుడూ, ప్రపంచ యువజన విద్యార్థి సమితుల కార్యవర్గ సభ్యుడూ అయిన సోరపో్న గుంటూరులో మాట్లాడుతూ "మీరందరూ ఐక్యంగా ఆహ్వానించడం, మాకెంతో సంతోషాన్ని గలిగించింది, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఇలాంటి ఐక్యతనే ప్రదర్శించుతారనుకుంటాను.' గుంటూరు' అనే పదానికి మా భాషలో 'ఉరుము' అని అర్థం. మీ స్వాతంత్ర్య పోరాటము సామ్రాజ్యవాదాన్ని పెకల్చే 'ఉరుము' వలె వర్ధిల్లుతుందని ఆశిస్తున్నా"నని అన్నాడు.

స్వాతంత్ర్య పోరాటాన్నెవరూ అణచలేరు

ప్రతినిధివర్గంలోని స్త్రీ ప్రతినిధి జెట్టీజైన్ గుంటూరులో మాట్లాడుతూ యిలా అన్నది: "మేము స్వాతంత్ర్య సమరంలో బ్రిటిష్, డచ్చి, అమెరికన్ సామ్రాజ్యవాదు లందరి యొక్క పశుబలగా న్నెదుర్కోవలసివచ్చింది. వాళ్ళకు టాంకులు, మరతుపాకులు మొదలైన ఆయుధాలున్నవి. మాకున్నవల్లా స్వల్పమైన ఆయుధాలు. అయినా మా పోరాటాన్నణచలేకపోయారు. ఆయుధ బలప్రయోగంతో స్వాతంత్ర్య పోరాటాన్నెవరూ అణచలేరని ఇండొనేషియా చరిత్ర ఋజువు చేస్తున్నది" జెట్టీజైన్ అఖిల ఇండొనేషియా సోషలిస్టు యువజన సమితి కధ్యక్షురాలు,

యువజనుల పాత్ర

ప్రతి దేశ స్వతంత్ర పోరాటంలోనూ యువజనులదే ప్రధాన పాత్ర. ఇందోనేషియాలో కూడ వారిది ఘనతరమైన పాత్ర. వారు చేతి బాంబులు పట్టుకుని రణరంగాని కురికారు. మర్దేకా! మర్దేకా! (స్వాతంత్ర్యం) అని స్మరించుతూ వేలాది యువకులు పోరాటంలో ప్రాణాలర్పించారని సోరపో్న అన్నాడు, స్త్రీలు వెనకబడలేదు. "మా స్వాతంత్రపోరాటంలో స్త్రీలు పురుషులతోపాటు యుద్ధరంగ ప్రధమ శ్రేణిలో ఉండి శత్రువుల నెదుర్కొన్నాం, ఆహార పదార్థాలు, మందులు సప్లయిచేశాం" అంటూ స్త్రీ ప్రతినిధి స్త్రీల పాత్రనుగూర్చి చెప్పింది.

మనవాగ్దానాలను నిలబెట్టుకోవాలి

తమ స్వతంత్ర పోరాటమింకా అంతం కాలేదని ఇండోనేషియా ప్రతినిధులు నొక్కివక్కాణించారు. వారి పోరాటాన్నణచడానికి డచ్చి సామ్రాజ్యవాదుల కండగా బ్రిటిషు సామ్రాజ్యవాదులు ఆయుధాలను, సైన్యాలను పంపారు, భారతసైన్యాలుకూడ యిందులో ఉన్నవి. భారత సైన్యాలను వెనక్కు రప్పించాలనిచేసిన అందోళనఫలించలేదు. గుంటూరు పురజనులిచ్చిన సన్మాన పత్రంలో ఇందోనేషియానుండి భారత సైన్యాలను వెనక్కు రప్పించేటట్లు భారత ప్రభుత్వంమీద ఒత్తిడి తీసుకొస్తామని వాగ్దానం చేశారు. మన వాగ్దాలను తాత్కాలిక ప్రభుత్వం ఆచరణలో పెట్టినప్పుడే మన బాధ్యత నెరవేరుతుంది,

విశాలాంధ్ర నినా

ఆంధ్ర మహాసభ

యస్. వి. నరసయ్య

జాతీయ చైతన్యం భారతప్రజలందరిలోను వెల్లివిరుస్తున్నది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులనుండి భారత దేశం స్వతంత్రం పొందవలయుననేగాక విశాల భారతదేశంలోని ప్రతి జాతి తమ విజ్ఞాన వికాసములను అభివృద్ధిచేసికొనుచూ నూతన భవిష్యత్‌ను నిర్మించుకోవలయుననెడి కాంక్ష అభివృద్ధి చెందుచున్నది. ఈ నూతన చైతన్యం నేడు దేశమంతటా భాషా ప్రయుక్తరాష్ట్ర విభజనకొరకు జరుగుచున్న ఆందోళనద్వారా ప్రతిబింబించుచున్నది. కొద్దిమాసముల క్రితమే ఢిల్లీలో జరిగిన అఖిల భారత భాషాప్రయుక్తరాష్ట్రమహాసభయే దీనికి తార్కాణం. నేడు మహారాష్ట్రులు, కన్నడులు, మలయాళులు, తమిళులు, మనము భాషా ప్రయుక్తరాష్ట్రములకొరకు జరుపుచున్న ఆందోళన యీ నూతన చైతన్యాన్ని ఋజువు పరుస్తున్నది, అభివృద్ధి నిరోధకుడయిన కొచ్చిన్ మహారాజుసైతం మళయాళీ ప్రజలలోని జాతీయ చైతన్యమును గుర్తించి ఐక్యకేరళ నినాదమును బలపర్చుతున్నాడు ఇట్టి అభివృద్ధి నిరోధకులు సైతం నేటి జాతీయ చైతన్యమును అడ్డగించి ఫలితంశూన్య మని గుర్తించుచున్నారు. ఉద్యమంలో జొరబడి విచ్ఛిన్నంజేయుటకు కుట్రలు పన్నుచున్నారు. ఇది నేడు మన ప్రజలలో వెల్లివిరుస్తున్న జాతీయ చైతన్య ప్రభావం

దేశాన్నంతటినీ జాతీయ చైతన్యం ముంచియెత్తుచున్న యీసమయంలో మద్రాసులో ఆంధ్రమహాసభ సమావేశం జరిగింది. 35 సంవత్సరముల నుండి ప్రత్యేక ఆంధ్రరాష్టం కొఱకు ఆందోళన జేయుచున్న ఆంధ్రులం యెందుకు ప్రత్యేకరాష్ట్రమును పొందలేకపోయాం? అని చర్చించి సత్వరరాష్ట్ర సిద్ధికి కార్యక్రమ మిస్తుందని ప్రతిఒక్కరం ఆసించాం. మరియొక వైపు నైజాం బానిసత్వంక్రింద నలిగిపోతూన్న తెలంగాణా ప్రజలు బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడుచున్నారు. నైజాం బానిసత్వము నుండేగాదు. విశాలాంధ్రసిద్ధికి గూడ నేడు తెలంగాణా పోరాడుతున్నది తమ పోరాటమును బలపర్చమని మనవైపు జూస్తున్నారు. ఆంధ్రమహాసభ సమావేశం తెలంగాణా సోదరులలోని చైతన్యమును అహ్వానించి వారిపోరాటాన్ని హృదయ పూర్వకంగా బలపర్చుతుందని ఆసించాం విశాలాంధ్ర పోరాటానికి ఆంధ్రమహాసభ నాయకత్వం వహించి నడుపుతుందని ఉవ్విళ్లూరాం నేడు నల్లగొండ ప్రజలపై జరుగుచున్న మిలిటరీ దాడుల నరికట్టుటకు బ్రంహ్మాండ మయిన ప్రజాఉద్యమాన్ని ఆంధ్రమహాసభ నిర్మించుటకు పూనుకొంటుందని ఎదురుచూచాం. కాని మహాసభ నడచిన నడక తీసికొనిన నిర్ణయాలు జూస్తే ప్రతిఒక్కరినీ నిరుత్సాహ పర్చినదని చెప్పకతప్పదు నేడు ఆంధ్రుల కోర్కెలను చైతన్యమును యీమహాసభ ప్రతిబింబించునట్లు ఆంధ్రమహాసభ నాయకులు నిర్వహించలేకపోయినారు

మహాసభ మొత్తం నడచిన నడకంతా పూర్తి మితవాద ధోరణిలోనేయుంది మహాసభలో ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం నిర్మించవలయునని తీర్మానించినా, రాష్ట్రసిద్ధికి సామ్రాజ్యవాదులవైపు అర్రులు చాచుట కన్పించుచున్నది

భారతప్రజల విజ్ఞాన వికాసములకుతోడ్పడు భాషాప్రయుక్త రాష్ట్ర విభజనకు సామ్రాజ్యవాదులు బద్ధవిరోధులన్న దృక్పధం మహాసభ చర్చలలో కన్పించదు, ఈ దృక్పధం లేకపోవుటచే రాజ్యాంగ సభకు, ఇండియా కార్యదర్శికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రమును ఏర్పరచమని విజ్ఞప్తులుచేసి సంతృప్తి చెందుటమాత్రం జరుగుచున్నది రాష్ట్రసిద్ధికి మన ప్రజలలోని చైతన్యమునకు ఒక స్వరూపమిచ్చి బ్రహ్మాండమయిన ప్రజావుద్యమమును నిర్మించి నవుడే సామ్రాజ్యవాదులు రాష్ట్ర విభజనకు అంగీకరించునట్లు చేయగలం

మన ఆంధ్రోద్యమము యీ మార్గమును అనుసరించువరకు వివిధ జాతి ప్రజలను ఒకే రాష్ట్రములో నిర్బంధించి మనలో మనకు చీలికలు ఏర్పరచి మనపై సామ్రాజ్యవాదులు పరిపాలన సాగిస్తారనే నగ్న సత్యాన్ని యీమహాసభ ఆంధ్రప్రజలకు తేట తెల్లం చేయలేకపోయింది. పైపెచ్చు ప్రకాశం పంతులుగారు సామ్రాజ్యవాదుల సలహాదారు బి ఎన్ రావు తయారు చేసిన బానిస ప్రణాళికనుబలపర్చారు, దానిని అంగీకరించమని మహాసభకు సలహా యిచ్చారు.

ఈ బి, యన్. రావు ప్రణాళిక ప్రకారం ఆంధ్రమహాసభ కోరే భాషాప్రయుక్త రాష్ట్రం ఏర్పడదు. మద్రాసు రాజధానిని మూడు భాగాలుగా జేసి ఒక గవర్నరు పెత్తనం చెలాయించుతాడు ఇప్పటివలెనే ఆంధ్ర, తమిళ, కన్నడ, మళయాళీ ప్రజలు యీ గవర్నరుచే పరిపాలింపబడతారు, నేటివలెనే ఒక జాతి ప్రజలపై మరొక జాతికి ద్వేషమును పెంచి మన అన్ని జాతుల ప్రజలను దోచుకొను సామ్రాజ్యవాదులపై మన ప్రజల ద్వేషం కేంద్రీకరించబడకుండా జేయుటకు సోదర జాతుల ప్రజలం మనలో మనం కలహించుకొనునట్లుమాత్రం జేస్తుంది, ప్రకాశంపంతులుగారు యీ ప్రణాళికను అంగీకరించమని యిచ్చిన సలహా మన నాయకులకు సామ్రాజ్యవాదులపైనున్న ఆశలను మాత్రం స్పష్టపరుస్తుంది, ఆంధ్రమహానభ ప్రకాశంగారి యీ సలహాను తిరస్కరించుట సంతోషించ తగిన విషయం,

మద్రాసు మహాసభలోని మరియొక ప్రధాన లోపం మహాసభ నిర్ణయాలలో విశాలాంధ్ర దృక్పధమేలేదు, హరిసర్వోత్తమరావుగారి రిపోర్టును అంగీకరించుట మినహా తెలంగాణా సోదరులవిషయమే ఈమహాసభలో కానరాదు.


నైజాం నవాబు సోదర ఆంధ్రులపై నేడు జరుపుచున్న అత్యాచారములను ఖండించుచూ తీర్మానమైనా లేకపోవుట మరీ శోచనీయం. మూడుకోట్ల ఆంధ్రప్రజలు స్వతంత్ర విశాలాంధ్ర క్రింద ఐక్యమయినప్పుడే మన జాతి పురోభివృద్ధి గాని, 80 లక్షల ప్రజల నైజాం బానిసత్వము క్రింద నలిగి పోతున్నంత కాలం మన జాతి పురోగమించ లేదన్న సత్యాన్ని ఈ మహాసభ గుర్తించలేదు విశాలాంధ్ర నిర్మాణమునకు నైజాం నవాబు అతని యజమానులైన సామ్రాజ్యవాదులు అడ్డు పడుతున్నారు.

ఈ అడ్డంకులను తొలగించుకొనుటకు ఆంధ్రులు ఎట్లు పోరాటమును సాగించవలయునో మద్రాసు మహాసభ వివరించలేకపోయింది. విశాలాంధ్ర మహాసభను గుంటూరులో జరిపి దానికి నైజాం దివాను మీర్జా ఇస్మాయిల్‌ను ఆహ్వానించవలయునని నిర్ణ

దానికి తిలోదకాలు

మద్రాసు సమావేశ సమీక్ష

యించి కార్యకర్తలు తెలంగాణా ప్రజలకేగాక, ముక్కోటి ఆంధ్ర ప్రజలకు తీరని అపచారం చేశాను. ఒకప్రక్క మీర్జా తోటితెలంగాణా సోదరుల రక్తాన్ని బలి గొంటూంటే మన ఆంధ్రనాయకులు తమసభకు ఆంధ్రులరక్తంతో తన దాహాన్ని తీర్చుకొనజూస్తున్న ఆ మీర్జానే ఆహ్వానించుట సిగ్గుచేటుగాదా ? మన ఆంధ్ర నాయకులయొక్క యీ సిగ్గుచేటు పనులను ఆంధ్రజాతి సహించుతుందా ? మన ఆంధ్ర నాయకులు యీ పంధాను ఎందుకు అవలంబించుచున్నారు ? భారతదేశ మొత్తంగా నేడు జాతీయ నాయకత్వం సామ్రాజ్యవాదులయెడ సంస్థానాధీశులయెడ అవలంబించే పంధాయే దీనికి కారణం ప్రజావిరోధులయిన సంస్థానాధీశుల మంచితనంపై వీరికి లేనిపోని భ్రమలున్నవి. భారత స్వాతంత్ర్యసిద్ధికి, వివిధ జాతుల ప్రజల అభివృద్ధికి సామ్రాజ్యవాదుల బంటులయిన నైజాంలాంటి సంస్థానాధీశులు ఎట్లు అడ్డో చూడలేకపోతున్నారు. అందుచే విశాలాంధ్ర సభకు మీర్జాలాంటి సామ్రాజ్యవాద తొత్తులను, ఒకప్రక్క సోదర ఆంధ్రుల రక్తాన్ని బలిగొంటున్నా సిగ్గూ బిడియం లేక ఆహ్వానించుచున్నారు ఈ పంధావల్లనే ఆంధ్ర నాయకులు ఎలుగెత్తి విశాలాంధ్రను చాటవలయునని చెప్పలేకపోతున్నారు సామ్రాజ్యవాదులపై ఆశలువదలి ప్రజాపోరాట మార్గమును అవలంబించిన నేడు విశాలాంధ్ర సిద్ధించునట్లు జేయుట సాధ్యమని మన ఆంధ్ర నాయకులు చూడలేకపోవుతున్నారు.



ఇంతేగాదు మద్రాసు మహాసభ బి.యన్. రావు ప్రణాళికను విమర్శించి గూడ ఆచరణలో యీ ప్రణాళికతో సరిసమానమైన మరియొక కోర్కెను కోరింది ఆంధ్ర రాష్ట్రము ఏర్పరచు వరకూ నేటిగవర్నరు క్రిందనే ఆంధ్ర జిల్లాలనుఉపరాష్ట్రంగా ఏర్పరుపమనికోరింది బి. యన్. రావు ప్రణాళిక సారాంశం గూడ అచ్చంగా ఇదే జరిగిన దల్లా డొంకతిరుగుడు బాటను మన ఆంధ్రనాయకులు బి. యన్ రావు ప్రణాళికను అంగీకరించుట. మహాసభ ఆంధ్ర భూమిని వదలి మద్రాసులో జరుపబడింది. మహాసభలో "మద్రాసు ఆంధ్రులదే" అనెడి వితండవాదన లేవదీసి ఆంధ్రతమిళ ద్వేషములను రెచ్చగొట్టు ఉపన్యాసములు జేయబడినాయి. ముఖ్యంగా ప్రకాశం పంతులుగారి ఉపన్యాసం మున్నగునవి నేటి మంత్రివర్గ తగాయిదాలకు యీ రాష్ట్ర సమస్యను ముడి పెట్టి తమిళ-ఆంధ్ర ద్వేషముల క్రింద మార్చ ప్రయత్నం జరిగింది. ఈ పద్ధతులేవీ సత్వర రాష్ట్ర సిద్ధికి తోడ్పడవు.

ఆంధ్రభూమిని వదలి మహాసభ మద్రాసులో జరుపబట్టి సంస్థానాధీశుల అండ సామ్రాజ్యవాదులపై ఆంధ్రోద్యమ నాయకులకు లేనిపోని ఆశలుండబట్టి నేడు ఆంధ్రులలోనున్న భావములను మహాసభ ప్రతి బింబించునట్లు చేయలేక పోయింది. చివరకు మహాసభకు వెయ్యిమంది ప్రజలనైనా సమీకరించలేక పోవుట జరిగింది ఆంధ్రభూమిని వదలి జరిపిన సభ నేలవిడిచిన సాముగాక మరిఏమిటి?

ఆంధ్రమహాసభ జరిగిన కొద్దిరోజులలోనే మద్రాసు అసెంబ్లీలో కూడ నేటి మద్రాసురాజదానిని భాషాప్రయుక్త రాష్ట్రములక్రింద విభజించమని కోరుతూ తీర్మానించబడింది.

మహాసభ తీర్మానములలోని సంకుచిత విశాంలాంధ్ర దృక్పధం లేకపోవుట అసెంబ్లీ తీర్మానములోగూడ స్పష్టమవుంతూది.

ఆంధ్ర మహాసభ నిర్ణయములలోను, అసెంబ్లీ తీర్మానాలలోనూ పై లోపములెన్నియున్నా ప్రత్యేక రాష్ట్ర కోర్కెను యువకుల మెల్లరం బలపర్చుతాం మనం విశాలాంధ్ర నిర్మాణమునకు పోరాడుచున్నా నేటి బ్రిటిష్ ఇండియాలోని ఆంధ్ర జిల్లాలను ప్రత్యేక రాష్ట్రంక్రింద విభజించుటను ఆహ్వానించుతాం. ఇట్టి విభజనను నేటి సోదర జాతుల మధ్య సామ్రాజ్యవాదులు పెట్టుచున్న ద్వేషములను అంతంజేయుటకు తోడ్పడుతుంది. మన భవిష్యదభివృద్ధికి విశాలాంధ్ర నిర్మాణం అవసరమని అందుకొరకు మన శత్రువు, తోటి జాతి ప్రజలుగాక నైజాం అతనికి అండగా వున్న సామ్రాజ్యవాదులని గుర్తించునట్లు చేస్తుంది.

ఇదే సమయంలో మన నాయకులు నేటి రాజీపంధాను వదలి ప్రజలవైపు తమ దృక్పధమును మార్చునట్లు యువకులం కృషిజేయవలసియున్నది. వీరోచితంగా పోరాడుచున్న తెలంగాణా సోదరులకు అండగా మన ఆంధ్రోద్యమం నిల్చునట్లు ఆంధ్రనాయకులు తెలం

(మిగతా 14 వ పేజీలో)

చిత్రకారులూ-ప్రజలూ

—మా. గోఖలే

గుడివాడ తాలూకా యువజన మహా సభ ఏప్రిల్ 11, 12 తేదీలలో అప్పికట్లలో జరిగింది. ఈసందర్భంలో యువజనసంఘం వారు ఒకచిత్రకళా ప్రదర్శనం ఏర్పాటుచేశారు. పోటీలుపెట్టి యువజనసంఘంవారి పిలుపువిని, ఆతాలూకాలో మూరు మూలల వున్న యువ చిత్రకారులు సభ ఆఖరు దశలో కూడవచ్చి, తమ చిత్రాలను ప్రదర్శించడము చూస్తూంటే వారి ఉత్సాహానికి ఎంతో ఆశ్చర్యం కలిగింది.

మామూలుగా ఇలాంటి చిత్రకళా ప్రదర్శనాలు ఏపట్టణాల్లోనో, ఏ పెద్ద పెద్ద బస్తీల లోనో, జమీందార్ల వేడుకసందర్భంలోనో, కళాకారుల సమ్మేళన సందర్భాల్లోనో కొన్ని ప్రత్యేకతలు కల్గి, ఏర్పాటు చేయబడటంరివాజు. కళానందం, సౌందర్యానందాలు, ఆ ప్రదర్శనలలోని ముఖ్యలక్షణాలు. అక్కడసామాన్య ప్రజలకు తావులేదు. వీరికా ప్రదర్శనలలోని చిత్రాలు అర్ధంకావు. వీరికి సంబంధించిన సమస్యలు ఆచిత్రాలలో లోపించడం కారణం గానే వీరికా ప్రదర్శనాలు దూరమయినాయి. అయితే "కళలు ఆలోచనలను, భావనలను, భావోద్రేకాలను ఒకరినుండి ఎక్కువమందికి అందజేసే శక్తికలవి. కళలు అందరి ప్రజలకు సంబంధించివుండాలి, అవి వారికి అర్ధమయే టట్లుగామా చైతన్యం కలుగ చేసేవిగానూ ఉండాలి" అని ఆధునిక అభ్యుదయ కాముకులు గుర్తించారు, వారిఅడుగుజాడలనే అనుసరిస్తున్న యువజన సంఘాలు, యువకులను సమీకరించి వారిని చైతన్యవంతుల్నిగా, శక్తివంతుల్నిగా, స్వేచ్ఛా స్వతంత్ర భావాలు కలిగియుండేవారినిగా తయారు చేసే నిర్మాణ కార్యక్రమానికి పూనుకున్నాయి. ఈసంఘాలు కళాకారులకు ప్రజలకూ మధ్య తెగిపోయిన అవినాభావసంబంధాలను తిరిగి నిర్మించి, దృఢపర్చేందుకు తోడ్పడేటట్లుగా ఈకళాప్రదర్శనల కార్యక్రమం కలిగి వున్నాయంటే నిజంగా మనం హర్షిస్తాం, అప్పికట్ల చిత్రకళా ప్రదర్శనం ఇందుకొక నిదర్శనం.

ఈ ప్రదర్శనంలో, వి. సత్యనారాయణ గారు, వి. శేషగిరిగారు, యస్. వి. చలపతి రావుగారు, యం. వి. కృష్ణారావుగారు, జగన్నాధంగారు, ఎ. చంద్రరావుగారు, కె. సూరన్నగారు. వివేకానందమూర్తి మొదలైన యువచిత్రకారులు, అరవై చిత్రాలను ప్రదర్శించారు, ఈ చిత్రాలను ఆయాసెక్షనుకు సంబంధించినవిగా- పోర్ట్రేట్స్, ఊహాచిత్రాలు, వస్తుచిత్రాలు, మోడల్‌చిత్రాలు, గోటిచిత్రాలు, పెన్సిల్ చిత్రాలు - విభజించి, పోటీలో నిలబడి గలిగినచిత్రాలకు, రజితపాత్రలు, ప్రఖ్యాత చిత్రకారుల చిత్రాలుగల ఆల్బమ్స్, సోవియట్ కాలెండర్సు, మెడల్స్‌ల రూపాలలో, పది ప్రధమ బహుమతులను సభా నిర్వాహకులు చిత్రకారులకు బహూకరించారు.

ప్రదర్శనలలో పాల్గొన్న చిత్రాకారులలో ఎక్కువమందికి చిత్రకళను నేర్పుతున్న గుడివాడ - హయ్యర్ ఎలిమెంటరీ స్కూలు డ్రాయింగు మాష్టరు, శ్రీ. కె. వేణుగోపాలం గారు, ప్రదర్శనానికి స్వయంగావచ్చి. చిత్రకారులకు ప్రోత్సాహకరంగా, ప్రదర్శన నిర్వహణకు సహకరించడం ప్రశంసనీయం.

ప్రదర్శించబడిన చిత్రాలలో వి. సత్యనారాయణగారి, కామ్రేడ్ "పి. సి. జోషి", "ఐక్యత" చిత్రాలు, సూరన్నగారి "గృహపరిశ్రమ" చిత్రం, టి. శేషగిరిగారి "ముసలిరైతు" చిత్రం, యస్. వి. చలపతిరావుగారి, "వృద్ధు" చిత్రం, యం. వి కృష్ణారావుగారి "వస్తుచిత్రాలు" పదేండ్ల బాల విద్యార్థి కంచెర్ల వివేకానందమూర్తి "రాణా ప్రతాప్, జ్ఞాన బుద్ధ" పెన్సిలు స్కెచెస్ ఎక్కువ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ ప్రజారంజకంగా వున్నాయి, ఈప్రదర్శనలోని చిత్రాలను చూసేందుకు వచ్చిన అప్పికట్ల గ్రామ రైతులు, రైతుస్త్రీలు, బాల బాలికలు తమ నాయకుల చిత్రాలను చూచి (వి. సత్యనారాయణగారి కామ్రేడ్ స్టాలిన్, పి, సి. జోషి, పి. సుందరయ్య, హారీ పాలిట్, రజనీ పామీదత్తు-మొదలయిన ఎనిమిది చిత్రాలు) వివిధ చిత్రాల వర్ణనలను అక్కడ నియమించ బడిన యువకుని ద్వారా తెలిసి కొంటూ పొందే ఆనందం చూస్తూంటే ఈ ప్రదర్శనం కొంత వరకు విజయాన్ని సాధించిందని పించింది.

ఇక్కడ యీ ప్రదర్శనంలోని చిత్రాలను గురించి నాఅభిప్రాయం కొంత చెపితే వుపయోగం వుంటుందనుకుంటున్నాను,

ఈ చిత్రాలలో ఒక భాగమయిన పోర్ట్రేట్సు రెండు పద్ధతులననుసరించి చిత్రించబడినాయి. ఒక పద్ధతి చిత్రాలలోని వ్యక్తులనే ఆధారంగా చేసుకుని (From life) చిత్రించినవీ, రెండో పద్ధతి ఫోటోలను ఆధారంగా చేసుకుని చిత్రించినవి. వ్యక్తులను ఆధారంగా చేసుకుని చిత్రించిన శేషగిరిరావు, చలపతిరావు, కృష్ణారావు గార్ల చిత్రాలు ఆకార పోషణలోనూ, రంగుల పొందికలోనూ, ముఖ భావాల్లోనూ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. పోర్ట్రేట్ చిత్రరచనలో వ్యక్తులనే ఆధారంగా చేసుకుని వారి రూపాలను యీవిధంగా చిత్రించే పద్ధతి చిత్రకారుని కళాభివృద్ధికి, ఆశయాలకు సరి అయిన మార్గం.

ఫోటోలను ఆధారంగా చేసుకుని చిత్రించిన సత్యనారాయణగారి "నాయకుల" చిత్రాల్లో పోర్ట్రేట్సులో వుండవలసిన సహజ జీవ లక్షణాలు లోపిస్తున్నయి. (ఒకే వైపునుండి ఒకే వ్యక్తిని వివిధ ఫోటో గ్రాఫర్లు తీసిన ఫోటోల్లో యీనాడు సామ్యత కనిపించటం లేదు.) ఈ లోపానికి కారణం, చిత్రంలో ఆ వ్యక్తికి సహజంగా వుండవలసిన ముఖంలోని వుబ్బెత్తులు, ముఖభావాలు, (Expression) వ్యక్తి సహజ లక్షణాలు (Charector) చిత్రించటం ఫోటోనుండి అసాధ్య మవటం వల్లనే. అంటే పోలికలు వున్నంత మాత్రాన ఏ పోర్ట్రేటూ సమగ్రతను తెచ్చుకోలేదన్నమాట.

"అయితే మనకు అందుబాట్లోలేని ప్రముఖ వ్యక్తుల చిత్రాలు చిత్రించవలసి వచ్చినప్పుడు ఫోటోల ఆధారంగాక ఇంకేం మార్గాలున్నవి?" అని ప్రశ్నించవచ్చు.

చిత్రకారులకు యీ స్థితి సంభవిస్తుందనే మామూలుగా కళాభ్యాస దశలలోనే అనేక ముఖభావాలు కలిగిన వ్యక్తుల ఆకార, రూపాలను, వుబ్బెత్తులను, అనేకవైపులనుండి-ప్రతి ఒక్క భాగం స్పష్టంగాతెలుసుకుంటూ-చిత్రించే పద్ధతి కళాశాలల్లోగాని, వ్యక్తిగతంగాగాని చిత్రకారులు అభ్యసించివుండటం రివాజు. ఈ అభ్యాసంలో గట్టిపడిన చిత్రకారుడే - అవసరాన్నిబట్టి - ఫోటోలోని ఆకారాన్ని ఆధారం చేసుకొని తన చిత్రంలో అసలు సహజ రూపాన్ని కొంతవరకు సాధించగలుగుతాడు.

అయితే, సత్యనారాయణగారిలో వుబుకుతున్న కళాకౌశల్యానికి అవకాశాలూ, సరయిన మార్గదర్శి లభించకపోటం ఎంతో శోచనీయ

(మిగతా 14 వ పేజీలో)

యువకుల కార్యకలాపాలు

మా విలేఖరి

బందరు తాలూకా అన్ని విధాలా వెనుక బడిన ప్రాంతం. నూటికి 92 మంది విద్యా విహీనులై, కుల మతతగాదాలకు, త్రాగుడు, జూదం మొదలగు దురభ్యాసాలకు లోనయి వుండేవారు. 5 సంవత్సరములనుండి యువ జనసంఘాలు వైజ్ఞానిక దళాలద్వారా, గ్రంధాలయోద్యమంద్వారా అక్షరాస్యతా ప్రచారం జేస్తున్నాయి. కుల, మత, అంటరానితనంమొదలగుమూఢాచారాలకువ్యతిరేకంగా గూడా తీవ్రంగ ఆందోళన జేస్తున్నాయి. ఈ ఉద్యమమునకుప్రారంభంలోచేనేత పారిశ్రామిక యువకులునాయకత్వం వహించారు. సనాతన పెద్దలకు వ్యతిరేకంగా పోరాడి వితంతు వివాహాలు సరియైన వేనని రుజువు జేశారు. ఈ తాలూకాలో వెనుకటినుండి పెత్తందార్లు కాపు, గౌడ కుల పిచ్చలను రెచ్చగొట్టి నాయకత్వం వహిస్తూ వచ్చారు. నేడు అలాంటివారిని విజ్ఞానవంత మౌతూన్న ప్రజానీకం దూరంజేస్తోంది. ఆ తాలూకాలో ప్రధానంగా వున్న కాపు, గౌడ, హరిజన, చేనేత యువకులంతా సంఘాల ద్వారా జాగృతి పొందుతున్నారు. కుల, మత విచక్షణలేని నూతన తరానికి యువజన సంఘాలు నాయకత్వం వహిస్తూ పనిజేస్తూన్నాయి. ఇదేసత్యాన్ని 10-4-47న పెండ్రొర్రులో జరిగిన తాలూకా యువజనమహాసభ రుజువుచేసింది.

15 గ్రామాలనుండి 38 మంది ప్రతినిధులు హాజరైరి. ప్రస్తుత పరిస్థితులలో పౌరసత్వ హక్కుల రక్షణకు; రైతు - కూలీ పోరాటాలకు అండగా; స్వాతంత్ర్య పోరాటంలో ఎలా తమ బాధ్యతలను నిర్వహించాలో చర్చించారు. కులనాయకత్వాలకు వ్యతిరేకంగా వివిధ కులాల సామరస్యమునకై కృషి చేయుటకు తగిన కార్యక్రమము తీసుకున్నారు. మారుమూల పల్లెలకుగూడా విస్తృతమైన యువజనోద్యమాన్ని నిర్మించుటకు చర్చలు జరిపారు. చర్చలలో యువజనసంఘాలు రాత్రి బడుల్లో విద్య నేర్పి డిబేట్సులో పాల్గొని వుపన్యాసకులుగా తరిఫీదుపొందిన (6 గురు) వారు పాల్గొని సంఘ కార్యక్రమ ప్రతిభను తెలిపారు. ఉపాధ్యాయుల కోర్కెలను బలపరుస్తూ మాట్లాడిన తీర్మానంపై చర్చలలో వుపాధ్యాయుడేపాల్గొని తమ కష్టాలను నివేదిస్తూ యువకులంతా అండగా వుండాలని కోరాడు. వైజ్ఞానికంగా యువజన సంఘాలు యిస్తూన్న ప్రోత్సాహాన్ని రుజువుచేస్తూ కప్పలదొడ్డి దళంవారు మన్య వీరుడు\సీతారామరాజు బుర్రకథ రాత్రికి జరిగిన సభలో ప్రశంసనీయంగా చెప్పారు. పిన్న వయస్కుడే ఐనా (18 సం॥) వీరభద్రేశ్వరా చారి గీసిన మహాకవి ఠాగూర్, భగత్‌సింగ్ ఫొటోలూ, ఇతర నాయకుల ఫొటోలు సమావేశానికి శోభను చేకూర్చాయి.

నూతన సంవత్సరమునకు సంఘ కార్యకర్తలుగా 11మంది యువజనసేవకులు ఎన్నుకోబడిరి. రాత్రికి జరిగిన మహాసభను ప్రారంభిస్తూ జిల్లా అధ్యక్షులు శ్రీ తాతినేని సూర్య ప్రకాశరావు గారు యువజనుల కర్తవ్యాల్ని గూర్చి, తాలూకాసంఘం సాధిస్తూన్న మహత్తర మార్పులను వివరిస్తూ వుపన్యసించిరి. సభకు తాలూకా యువజన సంఘ అధ్యక్షులు శ్రీ పుప్పాల రాఘవయ్యగారు అధ్యక్షత వహించిరి. 1000 మందికి పైగా అరుదెంచిన ప్రజలు తమ బిడ్డలుజేస్తూన్న కృషిని అభినందించిరి. కార్యదర్శి బూసం శంకరయ్యగారి అభివందనలతో సభ జయప్రదంగా ముగిసింది.

★

అయిదవ పశ్చిమగోదావరిజిల్లా యువజన మహాసభ ఏప్రిల్ 14, 15, 16, 17 తేదీలలో తాడేపల్లిగూడెంలో జరిగింది. జిల్లాలోని అన్ని



శ్రీ అంబికాచక్రవర్తి

తాలూకాలనుండి 24 చెడుగుడు టీములు పోటీలలో పాల్గొన్నాయి. ఇతర ఆటల పోటీలలో 25 గురు ఆటగాండ్రు పాల్గొన్నారు. చిత్రకళా ప్రదర్శనానికి 20 చిత్రాలు వచ్చాయి. చెడుగుడులో రాజారామమోహనరాయ్ మెమోరియల్ టీము (పెదపాడు) కు ప్రధమ బహుమతి వచ్చింది. పీచుపాలెం టీముకు రెండవ బహుమతి వచ్చింది. విచిత్ర వేషాలలో ఏలూరు, నర్సాపురం, తణుకు తాలూకాల యువజన సంఘాలు పోటీలలో పాల్గొన్నాయి. నర్సాపురం తాలూకా దళానికి మొదటి బహుమతి వచ్చింది. మెట్టవేనాంతం, భరతనాట్యం వగైరా ప్రదర్శించారు. ఏకాంకనాటిక పోటీలలో ఏలూరు దళానికి "తప్పెరా" అను నాటికకు ప్రత్యేకబహుమతి వచ్చింది.

తణుకు దళం "ప్రజాభక్షణ చట్టం" అను ఛాయానాటికను ప్రదర్శించింది. 17 వ తేదీని 500 మంది యువకులతో ఊరేగింపుజరిగింది. రాత్రికి బహిరంగసభజరిగింది. శ్రీ అత్తులూరి సర్వేశ్వర్రావు గారు అధ్యక్షత వహించారు. శ్రీ యుత వేములపల్లి వెంకటదాసుగారు జండా నెగురవేశారు. ప్రఖ్యాత చిటగాంగ్ విప్లవవీరుడు "అంబికాచక్రవర్తి ప్రజలను ఉద్రూతలూగిస్తూ 1½ గంటలు ఉపన్యసించారు. అనంతరం పెంటయ్య దళంచే సీతారామరాజు బుర్రకథ చెప్పబడింది. 6 వేలమంది వచ్చారు.

జిల్లాలోని వివిధప్రాంతాలనుండి 140 మంది ప్రతినిధులు, సమావేశమై చర్చించి ఈ క్రింది తీర్మానాలు చేసారు. రాజా రామమోహనరాయ్ మరణానికి సానుభూతి తెల్పుతూ, గాజుల్లంక రైతులపై కాల్పులను నిరసిస్తూ, ప్రజారక్షణ చట్టాన్ని రద్దుచేయాలనీ తీర్మానించారు.

నూతన సంవత్సరానికి అత్తులూరు సర్వేశ్వర్రావుగారు అధ్యక్షులుగాను, తిరుమలశెట్టి సూర్యారావుగారు ప్రధానకార్యదర్శిగాను, మరి 9 మంది కార్యనిర్వాహక సభ్యులుగాను ఎన్నుకోబడ్డారు. నేడు జిల్లాలో 130 గ్రామాల్లో 3200 సభ్యత్వంతో యువజనసంఘం పని చేస్తోంది. ఇట్టి యువజనసంఘం తాడేపల్లిగూడెం చరిత్రలో కనివిని ఎరుగని మహాసభ జయప్రదంగా జరిపి పశ్చిమ గోదావరిజిల్లా యువకులకు ఒక నూతన ఉత్తేజాన్ని కల్గించింది.

మయింది. తనకున్న కొద్ది అవకాశాలతో మారుమూలవున్న ఒక పల్లెటూర్లో కూచుని తన ఆశయాలను సాధించుకునేందుకు పట్టుదలతో తనంతటతానే అభివృద్ధి చెందుతూ ప్రజానాయకుల చిత్రాలను చిత్రిస్తూ, అభ్యుదయ మార్గాలననుసరిస్తూన్న యీ పేద కళా సోదరుడు, అభివృద్ధికి సాయం పొందగల అర్హుడు.

పైన సూచించిన ప్రకారం రూప చిత్ర రచనలో ఆసక్తివుంది. ప్రావీణ్యతను సంపాదించిన శేషగిరిరావు, చలపతిరావు, కృష్ణారావు గార్లు ప్రజాభావాల నెరిగి, వారిని ఉత్తేజపర్చటానికి ప్రజానాయకులను, వారి ఆదర్శమార్గాలను విరివిగా చిత్రించే అభ్యుదయ మార్గాలననుసరించినందువల్ల ప్రజాదరణ పొంది, మన వుత్తమ సాంప్రదాయాల ననుసరించగలరనటంలో సందేహంలేదు.

చిత్రాలలో రెండవ ముఖ్యభాగం సృష్టి. కళకు సంబంధించినది. ఈ భాగంలో సూరన్న, సత్యనారాయణ, జగన్నాథంగార్ల చిత్రాలు దాదాపు పది వున్నాయి. వీటిలో ఎక్కువ చిత్రాలయందు అనుకరణలు ప్రాముఖ్యంగా కనుపిస్తాయి. సూరన్నగారు 'గృహ పరిశ్రమ' చిత్రంలో గృహ పరిశ్రమ వాతావరణం చక్కగా చిత్రించారు. గోటి చిత్రాల్లో వీరి నైపుణ్యం ప్రశంసనీయం. వీరు బి. ఏ. మూడవ సంవత్సరంలో వుంటూ తనకున్న కొద్ది అవకాశంలో తనంతట తానే చిత్రరచన యథాశక్తితో యీవిధంగా చిత్ర రచనలు చేయటం చెప్పుకోదగిన విషయం. సత్యనారాయణగారి 'రైతు - వ్యవసాయకూలీ': జగన్నాథంగారి 'అవివాహిత' చిత్రాలలోని కృషి మెచ్చదగిందయినా, యీ చిత్రాలలో వీరు చెప్పదలచుకున్నది అస్పష్టంగావుంది. అంటే హృదయంలో విషయం ఎంత అస్పష్టంగా వుంటే చిత్రకారుని చిత్రంలోకూడా అదే ప్రతిబింబిస్తుందని వీరు గ్రహించాలి.

ఏ చిత్రకళా ప్రదర్శనమయినా వన్నె తెచ్చుకునేది, అందులో వున్న సృష్టి చిత్రాలను (Creative works) బట్టేనని చెప్పవచ్చు. చిత్రాలలోని విషయాలనుబట్టి వాటి ప్రభావం. వాటినిచూసే మానవ హృదయాల్లో స్థిరంగా నిలబడిపోయే ప్రత్యేకత సృష్టి చిత్రాలు కలిగివున్నాయి. ఈ ప్రదర్శనంలో యీ సృష్టి కళా లోపం కనుపిస్తుంది. చిత్రకారుడు ఫోటోను ఫొటో విధంగా పెద్దదిచేసి చూపించటంలో ఎంత విలువలేదో, అదేవిధంగా కళా సృష్టికి అనుకరణమీద ఆధారపడే చిత్రకారుడు అపరాధం చేసిన వాడవుతాడు. ఈనాడు కళయొక్క పరమార్థం ప్రజాభ్యుదయానికేననడం స్పష్టం. ఈ సత్యాన్ని ఎంత స్పష్టంగా కళాకారులు గుర్తించి ఏనాడు అభ్యుదయ మార్గాలలో ప్రజాజీవితాలను చిత్రించగలుగుతారో ఆనాడే అపస్మృతిగా పాతకళలను వల్లించే విధానం అడుగంటి, కాలానుగుణమయిన నూతన కళోదయమవుతుందని యీ యువ చిత్రకారులు తెలుసుకోగలరని నమ్ముతున్నాను.

కొన్ని వందల ఏండ్లనుండి ఏలుబడి వర్గ, ధనికవర్గాలకు సంబంధించిన ఏకొద్దిమంది, వ్యక్తులనో ఆనంద బెట్టటానికి కళలు ఉపయోగపడుతున్నయి. ఆయాకాల ఆర్థిక, సామాజిక పరిస్థితులనుబట్టే యీ మార్పులు సంభవించడమూ, క్రమేణా కళాకారులకూ, ప్రజలకూ మధ్య ఒక పెద్ద అఘాతం ఏర్పడడం జరిగింది. అయితే ఎంతోకాలంగా వుండిపోయిన యీ అఘాతం యింక ఎంతోకాలం పూడ్చబడకుండా వుండటానికి యీనాటి చరిత్ర ఒప్పటం లేదు.

ప్రజాశక్తులను చైతన్యవంతంగా అభ్యుదయ మార్గాల్లో ఏనాడు కళాకారుడు నడిపించ గలుగుతాడో ఆనాడే అతను అందరి ప్రజలను చేరుకోగలిగి, వారిచే స్వీకరించబడి, తాను పోగొట్టుకున్న స్థానాన్ని తిరిగి చేరుకోగలుగుతాడు.

ప్రజలకూ, కళలకూగల అవినాభావ సంబంధాన్ని గుర్తించి, అభ్యుదయ మార్గాన్ననుసరిస్తున్న యీ యువజన సంఘంవారు, తాము నిర్మించదలచిన ప్రజాభవనాలకు పునాదులను అలవిగాని బలం కలిగినవిగా నిర్మించగలరని ఆశిస్తున్నాను.

(11వ పేజీ తరువాయి)

గాజా పోరాటమును బలపర్చునట్లు వత్తిడి జేయవలసియున్నది. విశాలాంధ్రసభకు మీర్జాలాంటి సామ్రాజ్యవాద తొత్తులను ఆహ్వానించిన ఆంధ్రజాతి, ఆంధ్రయువకులు సహించరని చాటవలసియున్నది. యువకులం ఐక్యమై మన ఆంధ్రోద్యమం ఈ నినాదములను అంగీకరించునట్లు జేయగల్గినప్పుడే స్వతంత్ర భారతావనిలో విశాలాంధ్రను నిర్మించుటలో సఫలులము కాగలం.

లంకలోని రక్కసి

•

శ్రీ తెన్నేటి సూరి

చిన్ని చిన్ని మాటలూ
పెద్ద పెద్ద పాటలూ
చిట్టి చిట్టి చినుకులూ,
పెద్ద పెద్ద వరదలూ ....॥చిన్ని
చిట్టి చిట్టి బాలలూ
చిన్ని చిన్ని యోధులూ
కలసిమెలసి నిలచిరీ
కదనుమీద నడచిరీ ....॥చిన్ని
చిన్ని చిన్ని యోధులూ
చేరి, నిలచి, పోరగా,
పెద్ద పెద్ద రాజులూ
దద్దరిల్లి పోయిరీ ....॥చిన్ని
లంకలోని రక్కసీ,
డొంకలోన అరచెనూ,
చిట్టితల్లి సీతనూ,
లంకకెత్తు కెళ్లెనూ ....॥చిన్ని
లంకలోని రక్కసీ,
డొంకలోన అరచెనూ,
పిరికిపిల్లి కూనలూ,
గరిసెక్రింద దూరెనూ....॥చిన్ని
లంకలోని రక్కసీ,
డొంకలోన అరవగా
కోనలోని కోతులూ
కోపగించి కదలెనూ ....॥చిన్ని
పిన్న పిన్న కోతులూ,
భీతిలేని యోధులూ
బొమ్మరాళ్ళ నేరిరీ,
బుర్రపగల గొట్టిరీ ....॥చిన్ని
అంత పెద్ద రక్కసీ,
గెంతు గెంతి చచ్చెనూ,
చిట్టి చిట్టి కోతులూ
సీతతల్లి తెచ్చిరీ ... ॥చిన్ని
చిట్టితల్లి యెవరురా ?
సీతతల్లి యెవరురా ?
దున్నుకొన్న భూమిరా !
అన్నమెట్టు తల్లిరా !! ....॥చిన్ని
లంకలోని రక్కసీ
రంకెవేసె నెవడురా ?
జమీందారు రక్కసీ !
కోటలోని రక్కసీ !!! ॥జమీం

గుంటూరుజిల్లా యువజనమహాసభ ★

యువకులలో ఐక్యసందేశాన్ని చాటింది

"బిచ్చ మెత్తవద్దు, పోరాడండి" - బళ్లారి రాఘవాచారిగారు బాపట్ల జిల్లా యువజన మహాసభలో యిచ్చిన సందేశం యిది ఈ పవిత్ర సందేశాన్ని యువజన లోకానికి అందచేస్తూ గుంటూరుజిల్లా యువకసంఘం యువకులలో నిత్యమూ పనిచేస్తున్నది. రెండువందల సంవత్సరాలు బ్రిటిషు సామ్రాజ్యవాదుల పుణ్యమా అంటూ దోపిడీ చేయబడి, పతనమౌతూన్న సాంఘిక జీవితంలో దారీతెన్నూగానక దుర్భర పరిస్థితులలో ఉన్న యువకుల హృదయాల్లో కారుచీకట్లలోని దివ్యజ్యోతిలాగా, నవయుగ నిర్మాణానికి ఒకనూతన సందేశాన్ని మెరపింప చేసింది యువజన సంఘం. కృష్ణరాయబారాలు, వుద్యోగ విజయాలు ఆడుతూ మారుమూల గ్రామాల్లో నివురు గప్పిన నిప్పులాగా అణగారియున్న నాజరు, గోపీలాంటి యువకుల్ని నూతనసందేశాలతో ఉత్తేజపరచి, ఆంధ్ర వైజ్ఞానికరంగంలో గాయకులుగా. కవులుగా నటకులుగా ఒక ప్రధానపాత్ర వహించునట్లుచేసి, ప్రజాసేవలో నిమగ్నులై ప్రజల మన్ననలను పొందునట్లు చేసింది యువజనసంఘం తల్లిదండ్రుల మాట వినక మారాముచేస్తూ అల్లరిపిల్లలౌతున్న పసిగందుల్ని నూతన పద్ధతులతో సక్రమ మార్గాలలో పెట్టి, క్యాంపులద్వారా వారిలో అణగారియున్న కళాకౌశల్యాన్ని ఉప్పుగుండూరు బాలకుల్లాంటి బాలకులద్వారా ఆంధ్రలోకానికి పరిచయం చేసింది. శారీరక దౌర్బల్యంతో వృధాకాలయాపనచేసే యువకులకు ఆటలందు ఆసక్తిని కల్పించి, ప్రోత్సహించి వారి శారీరకాభివృద్ధికి తోడ్పడింది ఇంటూరు, గుంటూరు బాపట్లలో మహాసభలుజరిపి వేలకొలది యువకుల్ని సమీకరించి వారిహృదయాల్లో స్వాతంత్ర్య శంఖారావాన్ని మ్రోగించింది. స్వాతంత్ర్య సైనికులుగా శిక్షణ నిచ్చింది. ఆ యువజనమహాసభ ఈ సంవత్సరం ఏప్రిల్ 16, 17, 18, 19 తేదీలలో బాపట్ల తాలూకా పచ్చలతాడిపర్రులో జరిగింది,

రాజకీయ విభేదాలు పాటించలేదు

ఒకవైపు జిల్లాలో కరువు పిశాచి నాలుక చాచుకొని క్రమ్ముకొస్తున్నా, పైశాచిక దేశ రక్షణ చట్టం పట్టపగ్గాలు లేకుండా తుపాకులతోను, లారీలతోను ప్రజలపై విరుచుకుపడుతున్నా, ఇవిచాలావా అన్నట్లు మండువేసవి మండేఎండలతోను, వీచే వేడిగాల్పులతోను హుంకరిస్తున్నా, వేలకొలది యువకులు తమ సహజ ఉత్సాహ ఉద్రేకాలతో పాల్గొన్నారు. మహాసభను దిగ్విజయం చేశారు.

తమ మహాసభకు కావలసిన విస్తళ్ళు, కూరగాయలు మామిళ్ళపల్లినుండి బండ్లమీద రా మొదలిడినాయి. పొన్నూరు యువకులు విస్తళ్లు కుట్టించే హడావిడిలోవున్నారు గోళ్ళమూడిపాడులో కాంగ్రెసు కమ్యూనిస్టు భేదం లేకుండా పెరుగు అందజేశారు ఇక పచ్చలతాడిపర్రులో ధన సహాయమేగాక ఇంటింటి నుండీ బియ్యంపంపారు. 50 మంది యువకులు ఎండనక, వాననక అహర్నిశలూ వారం రోజులపాటు పనిచేసి మహాసభ ఏర్పాట్లను పూర్తిచేశారు. కాంగ్రెసు-కమ్యూనిస్టు పెద్దలు తమకుతోచిన సహాయంచేసి సభను జయప్రదం చేయటమేగాక యువజనసంఘ ప్రత్యేకతను నిరూపించారు.

యువ నైపుణ్యం

నాలుగు రోజులపాటు జరిగిన ఆటల కార్యక్రమంలో ప్రజలు, ఆటగాండ్రు కోలాహలంగా పాల్గొన్నారు. చెడుగుడు పుట్టిల్లు గుంటూరు జిల్లా, జిల్లాలో మధ్య తరగతి యువకుల్లో సంచారంచేస్తున్న యీఆటను జిల్లా యువజన సంఘం వ్యవసాయ కూలీల్లోకి. గ్రామగ్రామాలక తీసుకపోయింది తమ యీ ప్రియతమమైన ఆటల్లో రాజకీయభేదాలు అడ్డురావని నిరూపిస్తూ కాంగ్రెసు-కమ్యూనిస్టు యువకులూ యువకలోకంలో కులమత భేదాలకు ఆస్కారంలేదని నిరూపిస్తూ రైతు. కూలీ, స్కావెంజర్ల యువకులూ పాల్గొని యువజనోద్యమంలో నూతన శంఖారావాన్ని పూరించారు. 12 పౌనుల బరువు కల్గిన నేపల్లె రాఘవయ్యగార బస్తాలు మోయటంలో చూపి చాకచక్యం, మిలిటరీనుండి బదిలీ చేయబడిన దావులూరు సుందర్రావు (వ్యవసాయకూలీ) ఎత్తు, పొడుగు దూకుటలో చూపిన నైపుణ్యం, మోకులాగుటలో దొప్ప పూడి టీముచూపిన బలప్రదర్శనం, చూ టానికి వచ్చిన వెయ్యిన్నర ప్రజలన ఉత్సాహఉద్రేకాల్లో ముంచేసినాయి. చర్లుట్లలో జయిజయి ధ్వానాలతో మారుమోగింది ఇందుకు నిదర్శనంగా. మహాసభానంతర గూడా ప్రక్క- కాంగ్రెస్ గ్రామాలైన మునిపల్లె దొప్పలపూడి గ్రామపెద్దలు, యువకులు 10 రూపాయిల వరకూ చందాలిచ్చి ఆదరించారు

(మిగతా 18 వ పేజీలో)



చెడుగుడు పోటీలు

ఆంధ్రదేశంలో ఆదర్శ బాలసంఘం



చెల్లాయిలూ, తమ్ముళ్లూ !

మీరంతా బళ్లో చదువుతుంటారు. నేను కాలేజిలో చదువుతున్నా. మీ కంటే పెద్దదాన్నిగా, అందుకని మీరు నన్ను 'అక్కాయి' అని పిలవండి ! మిమ్మల్ని 'చెల్లాయిలూ - తమ్ముళ్లూ' అని పిలుస్తాను.

సంపాదకులు మీకోసం 'నవయుగ' లో ఏమన్నా వ్రాయమన్నారు. ఏమివ్రాయను చెప్పండి ? ఈసారికి మీ బాలసంఘాలను గూర్చే రాస్తా.

గుంటూరు జిల్లాలో ఉప్పుగొండూరు అనే ఊరువుంది. ఆ ఊళ్లో బాలసంఘం వుంది. అదిచాలా చక్కగా పని చేస్తూంది.

ఉప్పుగొండూరు బుర్రకథ దళంపేరు మీరు వినే వుంటారు అఖిలభారత విద్యార్థి మహాసభలో వాళ్ళు వినసొంపుగా బుర్రకథ చెప్పారు. 30 వేల ప్రజలు ఆ పిల్లలను ఆశీర్వదించారు. ఇంకా ఆ దళం అనేక ఊళ్ళల్లో, నగరాల్లో బుర్రకథలు చెప్పింది. పెబాస్ అని పించుకొంది.

ఇదంతా ఉప్పుగొండూరు బాలసంఘం చక్కగా పనిచేయడంవల్లనే జరిగింది. పిల్లలు పాటలు నేర్చుకొన్నారు బుర్రకథలు తరిఫీదు పొందారు దేశమంతటా పేరు పొందారు


ఆబాలసంఘమే ఒకవ్రాత పత్రికను కూడ నడుపుతూంది దానిపేరు 'బాలజ్యోతి' దానిలో పాటలు, కథలు, వ్యాసాలు, బొమ్మలు ఉంటాయి దానిని చూస్తే మీరు ఆశ్చర్యపడతారు. చిన్నపిల్లలు ఇంతచక్కగా ఎలా నడుపుతున్నారా ? అనిపిస్తుంది.

బాలజ్యోతి యిప్పటికి 6 సంచికలు వచ్చినవి వాటిలోనుంచి ఇక్కడ కొన్నిబొమ్మలు, పాటలు, కథ యిక్కడ వేస్తున్నాము. చూడండి ఎంత బాగున్నాయో !

మీరుకూడా మీఊళ్లో బాలసంఘం పెట్టండి. బాగా చదవండి. ఆటలు, పాటలు నేర్చుకోండి! పత్రికను నడుపండి తెలుగుబిడ్డలు సాటిలేని మేటి పిల్లలు అనిపించుకోండి.

అభివందనాలతో.

మీ అక్కాయి.



భాయీ ! భాయీ !

కులమతంబులు కాల రాయాలోయ్ !

రచన:— యన్. కె రావు

[మే సంచిక బాలజ్యోతినుండి]

డొక్కనిండుగ మెక్కి
టక్కరిగ తిరుగుచు
నక్కలా తిరిగేటి
టక్కరి మూకలు
కలకత్త బొంబాయిలో
కుల మతంబుల పేర
కత్తితో కుత్తుకల
కత్తిరించి ప్రజల
కష్టాలలో పెట్టి
కాల రాస్తున్నారు.
కష్టజీవులు కనులు
తెరవా లోయ్
కుల మతంబుల
కాలరాయాలోయ్॥
అన్నదమ్ముల మధ్య
ఆరని అగ్నియై
ఎండ వానలలోన
బండలా కష్టించి
పగలు రాత్రులనక
పలు బాధలకు వోర్చి
తీరికా కాలములో
తలదాచు కొనె కొంప
తృటికాలములో మండి
తగులబడి యుండురా ॥కష్ట॥
చరిత్రలో స్త్రీలను
సువర్ణాక్షరములతో
లిఖియించి పూజించు
వారి జాతికి జెందె
వనితలను చెరచంగ
కుక్కలా తిరిగేటి
రక్కసులు యీనాడు
పక్కలో బల్లెమై
పతివ్రతల నెందరినో
బాధించు చున్నారు ॥కష్ట॥
మండె కడుపుకు ముంత
గంజికె మొగమాసి
కట్ట బట్టాలేక కుములుతూ ఒకవంక
బక్కచిక్కి బ్రతుకు
...రమై మరణిస్తూ
...దకు తుచ్ఛంచేత
...నువు తెగిపోవుట
...రత జాతికి యిట్టి
...తబంధనాల్ జుట్టి
...ధ్య గూర్చొని మధ్య
...త్రిగా మనలను
...ంచి మాటల తోడ
...ంచి పోతున్నాడు.
...ంగ్లీషు వాడెరా
...ల్లు చిచ్చెట్టాడు.
...ందు ముస్లిం ప్రజ లెక్కడున్నాను
...ద ధనికుల మధ్య భేదమే గాన్పించు
కులము పెచ్చయిన ఏకులము హెచ్చయిన
...ర్మిక కర్షకుల ఆకలి తీరునా?
...కొద్దిభేదాలు మేమంత ఒకటంచు
...లచి పోరాడంగ నేడె లేవాలిరా ॥కష్ట॥

నాటక

పంతులుగారి శిష్యులే ప్రజానాయకులు ఫలితం?

రచన :—నర్రావుల వెంకట సుబ్బారావు.

—. నటకులు :—

1. రహీం 3. రాముడు
2. గోపాల్ 4. పంతులు

—: మొదటి రంగం :—

(బాలసంఘం ఆవరణ - రాముడు - రహీం - గోపాల్ ఆడుకుంటుంటారు)

కాలం :- సాయంత్రం.

రా: అరే రహీం! ఇవ్వాళ నీవు బడికి రాలేదేమోయ్.

రహీం : రాలేదుభాయ్; మాబాబు బజారు పనిక్కి పంపించారు. ఈరోజు బళ్ళో ఏమైనా తమషా జరిగింది భాయ్ ?

రా: జరుగకేమోయ్. మన పంతులుగారు పాఠం చెప్తూనే పడిపోయారు పాపం! అప్పుడు మాఅందరికీ భయం వేసిందోయ్, చాలాసేపటికి తెప్పరిల్లుకొని లేచారు,

రహీం : మళ్ళీలేచారూ ?

గో: ఛా, అదేమిటోయ్ అలాగంటావ్.

రహీం : లేకపోతే హేమ్బిటోయ్! నేనూ రాక రాక హెప్డు హన్న బడిక్కి వస్తే జరాసర్దాగా మాటాడొక్కకుండ చావగొడ్తాడ్ భాయ్.

గో : అయితే నీవు బడికి వచ్చేది పాఠాలు నేర్చుకొంటానికా ? సర్దాగా మాట్లాడుకొంటూ అల్లరిచేయటానికా ?

రహీం : అదిగాదుభాయ్, చుపేక్కచెప్పాను లేవోయ్ పంతులుసాబ్ హెందుక్క పడిపోయార్ ?

రా: పాపం. వీరికి తింటానికి కడుపునిండా తిండిలేక చాలీ చాలని అన్నంతో పగలంతా మన కందరకూ పాఠాలు - పాటలు - ఆటలు చెప్పటం, మన తగవులు తీర్చటం, శిక్షలు వేయటం, ఇదీచాలక బడికిరాని నీలాంటి పిల్లల ఇండ్లకు వెళ్ళి పిలుచుకురావటం-ఇదంతా ఎంత శ్రమంటావ్ రహీం ? కనుకనే వారికి రోజు రోజుకూ బలంతగ్గి యివ్వాళ పాఠం చెపుతూనే పడిపోయారు పాపం.

గో: అయ్యవారు గుడ్డలుగూడా మంచివేసుకోరోయ్, చినిగినవే వేసుకొని వస్తారు. మనకు చెప్పటంమాత్రం మంచి బట్టలు వేసుకోవాలని చెప్తారోయ్.

రహీం: హయ్యావారికి కొడుక్కు ఉండ లేదుభాయ్ వాడిక్కహెప్డునమ్ము శన్గపప్పుల్ హడ్గుతాడూ భాయ్. పంతుల్‌సాబ్ వాడిక్క పప్పుల్ కొనిపెట్టగూడదూ ?

రా: నీకు తెలియదు రహీం. మనపంతులు గారికి జీతం చాలా తక్కువటోయ్, తిండికే చాలని జీతంలో గుడ్డలు, పిల్లలకు చిరితిండి ఎట్లాకొని పెడతారోయ్ ?

రహీం: పంతులుసాబ్‌కు డబ్బా సాల్కపోతే నాదీ జేబ్‌లో ఏక్‌పైసాఉంది, ఇస్తాన్ భాయ్.

రా: మనం ఎన్ని పైసాలిస్తే ఏమౌతుంది. మన పెద్దవాళ్ళు, మన ప్రభుత్వము పంతులు వారి కష్టాలు కనిపెట్టి తగినంత జీతం యిస్తే వారిబాధలు తీరుతవోయ్, అందుకుగాను మనమంతా ఒక పనిచెయ్యాలి.

గోపాల్, రహీం: (ఆతురతతో) ఏం చెయ్యామంటావ్.

రా: మనం మన తల్లిదండ్రులవద్దకువెళ్ళి అయ్యవార్లకు తగినంత జీతాలు యిచ్చేవరకు మన ప్రభుత్వాన్ని నిద్రపోనీయ గూడదు అని వారికి చెప్పుదాం. ఈలోగా మనకు తోచిన సహాయం మనం చేద్దాం, ఏమంటారు ?

గోపాల్, రహీం: ఏం సహాయం చెయ్యమంటావ్ ?

రా: (వారిని దగ్గరకుపిలచి చెవిలోఏమిటో చెప్పి) సరేనా ?

గోపాల్ రహీం: బలేబాగుంది ఉపాయం (అంటూ అందరూ వెళ్తారు)—తెర

రెండవ రంగం

(బడిలో పంతులు ఒక్కరే ఆలోచించుకొంటూ కూర్చొని వుంటారు. రాముడు - గోపాల్ - రహీం బియ్యం, కూరగాయలు, కొత్తగుడ్డలు తెచ్చి పంతులు ముందుపెట్టి నమస్కరించి నిలుచుంటారు)

పంతులు : ఎందుకోయ్ యివన్నీ యిక్కడకు తెచ్చారు ?

అందరు : మా అమ్మా వాళ్ళు మీకు యివి యిచ్చిరమ్మన్నారండి.

పం : ఎందుకోయ్ ? ఈరోజు ఏమిటి విశేషం ?

రా : ఏమీలేదండి. నిన్నమధ్యాన్నం మీరు పాఠం చెప్తూచెప్తూనే క్రిందపడిపొయ్యారుగా ?

పం : ఐతే ?

రా : అప్పుడు మా అందరికీ చాలా భయం వేసిందండి. ఆసంగతి మా పెద్దవాళ్ళతో చెప్పామండి. వారు ఎంతోనొచ్చుకున్నారండి. ఇవిమీకు ఇచ్చిరమ్మన్నారండి.

పం : నేను నిన్న పడిపోవటానికి - మీ వాళ్ళు ఇవి నేడు పంపించటానికి ఏమి సంబంధం వుందోయ్ ?

రా : సంబంధం వుందనే పంపించారండి; మీకిచ్చే జీతాలు, బియ్యం కొనుక్కోడానికి గూడా చాలకుండా వున్నాయని మా పెద్దవాళ్ళు జాలిపడ్డారండి!

ఇంతేగాక మా వాళ్ళంతా కలసి మన మంత్రుల దగ్గరకు వెళ్ళి మాకు పాఠాలుచెప్పి మమ్మల్ని బాగుచేసే మీకు మంచి జీతాలు ఇప్పించే అంతవరకు నిద్రపోమని మాకు నచ్చ చెప్పారండి. ఇవి తీసుకొండి. తీసుకొంటే మేము తిరిగి వెళ్ళి అన్నంతిని బడి టైముకు అందుకుంటాం. లేకుంటే మేము మా ఇళ్ళకే వెళ్ళమండి.

పం : నాయనలారా!

మీకున్నదయ-మీకున్న సూక్ష్మ దృష్టి ఇదివరకు మీలాగే బాలురుగాఉండి మావద్ద చదువుకొని ఇప్పుడు పెద్దవారైన ప్రజా నాయకులకు ప్రజా మంత్రులకు-పెద్ద ఉద్యోగస్తులకు ఉంటే మన దేశంలోని బడిపంతుళ్ళ బాధలు ఎప్పుడో తొలిగి పోయేవి నాయనా!

ఏదేశంలోనైనా బడిపంతులు బాగుపడితేనే ఆదేశంయొక్క బాగుఅనే సత్యాన్ని మీరైనా పెద్దలకు జ్ఞాపకం చేస్తూవుండండి. మీకు నా ఆశీస్సులు. వెళ్ళిరండి. మరల బడిటైముకు అందుకొండి.

(పిల్లలు సంతోషంతో చంకలు కొట్టుకొంటూ వెళ్ళుతారు) —: తెర :—

బందలాయిచెరువు హరిజనవాడ

యువజనసంఘ కృషి

ప్రభుత్వం మద్యపాన నిషేధాన్ని అమలు పర్చిన జిల్లాలనుండి కల్లు, సారాయి దొంగ అమ్మకదారుల అరెస్టులు మద్యపానంతో వళ్లు మరచి పిచ్చిచేష్టలు చేసినవారి అరెస్టువార్తలు ప్రతిరోజూ పత్రికలలో చూస్తున్నాం కాని బందలాయి చెరువు హరిజనవాడ (దివి తాలూకా) నుండి వచ్చే మరియొకటి యువజన సంఘ కృషితో యువకులు మద్యపానాన్ని నిషేధించారు తమసంఘ జీవితములు అభివృద్ధి జేసుకొనుచున్నారు ఇది ఎట్లు సాధ్యమయింది?

జానెడు పొట్టకోసం దినమెల్ల కష్టించినా మన హరిజన సోదరులకు పొట్ట నిండదు. దినమంతా జేసిన బండచాకిరి బడలికను తీర్చుకుంటానికని నూటికి 90 మంది హరిజన సోదరులు సాయంత్రమవ్వగనే కల్లు అంగడి జేరుతారు, కష్టించి సంపాదించినది కాస్త యిచ్చుటతగలేస్తారు. ఇంట్లో ఆలు బిడ్డలు పస్తులే, హరిజన సోదరుల యీ పరిస్థితులను ఆధారం జేసుకొని వీరిని గ్రామ పెత్తందారులే గాదు-కుల పెత్తందారులు కూడ పీల్చిపిప్పి జేస్తుంటారు. ఈపరిస్థితి యితరచోట్లవలె బందలాయి చెరువు హరిజన వాడలో గూడ ప్రత్యక్షం.

కామ్రేడ్ అర్జున్ నాయకత్వాన యువకుల అభివృద్ధికి కృషి ప్రారంభమయింది. మొదట 10 సంఘంలో జేరారు. ఊరేగింపుల ద్వారా, సభల ద్వారా ప్రచారం చేశారు 10 మంది యువకులు ముందుకు వచ్చి యిక ముందు మద్యపానాన్ని చేయమని బహిరంగంగా ప్రతిజ్ఞ తీసుకున్నారు. తర్వాత హరిజనవాడలో ఒకరాత్రి పాఠశాల వెలసింది 20 రోజుల కృషి తర్వాత 40 మంది యువకులు సంఘ నాయకత్వం క్రిందికి వచ్చారు. ఈ 40 మంది కూడ కల్లు త్రాగమని ప్రతిన బూనారు. వీరు యింతటితో ఆగలా!

ప్రక్కనున్న అశ్వరావుపాలెం హరిజన వాడకు బయలుదేరారు ప్రచారం ప్రారంభించారు. తమగ్రామంలో యువకులు నూతన సంఘకట్టుబాట్లను ఎట్లు నిర్మించుచున్నది వివరించి యువకుల సహాయాన్ని, సానుభూతిని పొందారు. ఇది పెత్తందారు మురాకు రుచించలా. యువకులపై వచ్చిన తమ పెత్తనం ఊడుతుందని వీరికి భయం. అయినా యువకులు పురోగమిస్తున్నారు.

బందలాయి చెరువు హరిజనవాడకు గవర్నమెంటు యిచ్చిన సొసయిటీ భూమి 33 యకరాలువుంది. 7 సంవత్సరముల నుండి దీనిపై ఫలసాయాన్ని ఇతరులకు దక్కనీయకుండా గ్రామపెత్తందార్లు, కులపెద్దలు అనుభవించుతున్నారు. యువకులలో సంఘం తెచ్చిన యీచైతన్యంతో ఈదోపిడీని యిక సహించదలచలేదు. యువకులు ఆందోళన ప్రారంభించారు. లేబరు ఇనస్పెక్టరు కలుగ జేసుకొనవలసి వచ్చింది. విచారణలో వెనుకటి పెద్దల దొంగతనం బయటపడ్డది పాత కమిటీకి స్వస్తి చెప్పబడింది. నూతన కమిటీ ఎన్నుకోబడింది. యువకుల ఈవిజయంతో యువజనసంఘమంటే పెత్తందార్లకుకన్నెర్రయింది, యువకులలో సంఘ మంటే అభిమానం హెచ్చింది! ఆదర్శవంతంగా ప్రతి కార్యక్రమాన్ని తీసుకొని కృషి జేసే యువజన సంఘాన్ని పెత్తందార్ల కడుపుమంట ఏమి చేయగలదు? బందలాయి చెరువు హరిజన వాడ యువకుల కృషి మనకెల్లరకు ఆదర్శమైనది

(15 వ పేజీ తరువాయి)

ఉత్సాహంలో యువకుల్ని మించారు. బాలబాలికలు ఒక్క కుందుకుట్టులో 16 బాలుర టీములు, 7 బాలికల టీములు పాల్గొన్నాయి. కుప్పిగంతు లేస్తూ, ముద్దులొలికిస్తూ ఆడిన ఆ బాలబాలికల ఆటలు ఎంతో ముచ్చటగా ఉన్నాయి. ప్రజల్ని ముగ్ధులుగా చేసినాయి. రెండువందల మంది యువకులు, వందమంది బాలబాలికలు మిట్టిపడే యౌవ్వనంతో, పొంగి పొరలే ఉత్సాహంతో పాల్గొని, జిల్లా ఒలెంపిక్ పందాల్ని దిగ్విజయం చేశారు.

వైజ్ఞానిక సభ


ఆంధ్రనాటక రంగంలో మేటియని పేరు పొందిన మాధవపెద్ది వెంకట్రామయ్య గారి ఆధ్వర్యాన వైజ్ఞానిక పోటీలు జరుపబడ్డాయి. సత్తెనపల్లి నుండి తెలంగాణా బుర్రకథ, పచ్చల తాడిపర్రునుండి నేతాజీ సుభాసుబోసు బుర్రకథ, ముట్లూరు, జూపూడి మన్నవ పాల్గొన్నాయి. రేపల్లెదళం వారు రైతు తన నిత్యజీవితంలో పడుతున్న బాధల్ని, ఎదుర్కొంటున్న సమస్యల్ని చిత్రించే "పైపంట" నాటకాన్ని ప్రదర్శించారు, మాధవపెద్ది వెంకట్రామయ్యగారు తన ఉపన్యాసంలో ఆనాటి కత్నెలా ఉత్తేజపర్చిందీ విశదీకరిస్తూ, అలాంటి ఉత్తమ నాటికలు నేటి నాటక రంగస్థలానికి ఎక్కవలసిన ఆవశ్యకతను గూర్చి తన సహజ నటనా చాతుర్యంతో వివరించారు. రేపల్లెదళంవారి సైసై నృత్యం, ఉప్పుగుండూరు బాలసంఘం వారి నృత్యాలు ప్రేక్షక లోకాన్ని ఆనంద డోలికలలో ఉర్రూతలూగించినాయి

విప్లవ సందేశం

19 రాత్రి మహాసభ, 10 మైళ్ళదూరంలో ఉన్న అమృతలూరునుండి 150 మంది స్త్రీ పురుషులు బళ్ళమీద, కాలినడకమీద తాడిపర్రు చేరారు. మాచవరంనుండి 200 మంది జయజయధ్వానాలతో సభాస్థలానికి చేరారు. 12 వేలమంది ప్రజానీకంతో సభాస్థలం కిలకిలలాడుతోంది. మానికొండ సూర్యావతిగారు జండానెగురవేస్తూ యువకలోకం స్వాతంత్రం-శాంతి - అభ్యుదయంకొరకు కృషి సల్పాలని ఉద్బోధించారు. అధ్యక్షత వహించిన దాసుగారు యువకులలో వచ్చిన చీలికలను వివరిస్తూ యువకులంతా ఏకబాటన సాగిపోవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు మహాసభను ఆశీర్వదిస్తూ, ఇండోనేషియా ప్రతినిధులు భారత యువకుల విజయమే తమవిజయమని, భారత యువకులు మార్గదర్శులుగా ముందుకు సాగిరండని ఆదేశించారు. సభాప్రారంభకులు అంబికాచక్రవర్తి చిటగాంగు ఆయుధాగారాన్ని దోచిన విప్లవనాయకుడు. 28 సంవత్సరాలు జైలుజీవితంలో, మాతృదేశదాస్య విముక్తికై ఒకకన్ను, ఒక ఊపిరితిత్తి అర్పించిన వీర యోధుడు. ఆంధ్రప్రజలను సంబోధిస్తూ ఆయన యిచ్చిన విప్లవ సందేశం వినవచ్చిన ప్రజానీకాన్ని ఉత్సాహ తరంగాలలో ఊపివేసింది, అంబికాచక్రవర్తి వర్ధిల్లాలి! జిల్లా యువజన సంఘం జిందాబాద్! అనేనినాదాలతో దిక్కులు పిక్కటిల్లే జయధ్వానాలతో సభముగిసింది.

నవయుగ చందావివరాలు

సంవత్సర చందా	3– 0–0
అర్ధసంవత్సర చందా	1– 8–0
మూడు మాసాలకు	0–12–0
విడిపత్రిక	0– 4–0



సూర్యరశ్మితో యంత్రాలు నడుపుతున్నారు

— రావు

సూర్యరశ్మితో యంత్రాలు నడిపే సూత్రాన్ని సోవియట్ యూనియన్‌లో ఫెడరిక్ మోలెరో అనే శాస్త్రవేత్త కనిపెట్టాడు. మోలెరో, జన్మతః స్పెయిన్ దేశస్థుడు 1936 లో స్పెయిన్ రిపబ్లిక్ ప్రభుత్వ సైన్యంలో ఇంజనీరింగు శాఖకు కమాండర్‌గా వుండి ఫ్రాంకోకు వ్యతిరేకంగా పోరాడాడు కాని నాజీ జర్మనీ, సామ్రాజ్యవాద బ్రిటనుల సహాయంతో ఫ్రాంకో కుట్రఫలించింది. రిపబ్లిక్ ప్రభుత్వం ఓడిపోయింది. ఫాసిస్టు ఫ్రాంకో అధికారంలోకి వచ్చాడు మోలెరో మెల్లగా స్పెయిన్ దేశాన్ని విడిచిపెట్టి సోవియట్ యూనియన్‌కు చేరుకున్నాడు 1939 నుంచి సోవియట్ సైన్సు ఎకాడమీలో పనిచేస్తున్నాడు సోవియట్ ప్రభుత్వం ఈ విజ్ఞానవేత్తకు అన్ని విధాలా సహాయం చేస్తూ, ప్రోత్సహిస్తూంది.

★

భూతద్దంతో దూదిని కాల్చడం చాల మంది విద్యార్థులకు తెలిసేవుంటుంది. అదొక తమాషాగా ఆడుతూ వుంటారుకూడాను. నీచేతిలో ఒక భూతఅద్దం (కాన్‌వెక్స్‌లెన్సు) వుందనుకో, దానిని ఎండలో భూమికి కొంచం ఎత్తుగా పెట్టుకొని దానిలోనుంచి సూర్యకిరణాలు ప్రసరించేటట్లు చెయ్యి. అలా ప్రసరించే కిరణాలు ఒకచోట కేంద్రీకరింప బడేటట్లు భూమికి ఆ అద్దాన్ని సరిచేసి పట్టుకో. అలా కేంద్రీకరింపబడినట్లు గుర్తు ఏమిటంటే సూర్యరశ్మి ఒక తెల్లటి చుక్కలాగ అక్కడ పడుతుంది. అద్దానికి ఈ చుక్కకి ఉన్న దూరాన్నే దాని ఫోకల్ పాయింటు అంటారు. ఆ కేంద్రీకరింప బడిన చుక్కవద్ద దూదిని పెట్టావంటే అది తగులబడి పోతుంది అంటే సూర్యకిరణాలలోని వేడిఅంతా అద్దంగుండా ఈచుక్క దగ్గర కేంద్రీకరింపబడి దూదిని కాల్చ గలుగుతోందన్న మాట. దూదికి బదులు అక్కడ ఒక గ్లాసుతో నీళ్ళు పెట్టావనుకో. కొంత సేపటికి ఆనీళ్ళు సలసలా కాగుతాయి

ఇదే సూత్రాన్ని మోలెరో; యంత్రాలు నడపడానికి అవలంబిస్తున్నాడు. మనం పైన చెప్పిన భూతఅద్దానికి (కాన్‌వెక్స్‌లెన్సుకు) బదులు ఒక పెద్ద దొన్నెలాంటి అర్ధ చంద్రాకారంగల మామూలు అద్దాన్ని (కాన్‌కేవ్ మిర్రర్) ఉపయోగిస్తున్నాడు. ఆరు బైట ఎండలో ఈపెద్దదొన్నె అద్దాన్ని నిలబెడతారు దానిమీద సూర్యరశ్మి పడేటట్లు దాన్ని అమరుస్తారు. సూర్యుడు ఎటువుంటే అటు (పొద్దునుబట్టి ఋతువులనుబట్టి) దాన్నితిప్పే ఏర్పాట్లుకూడా వుంటాయి ఈఅద్దంమీద పడిన సూర్యరశ్మిదాని ఫోకల్‌పాయింటువద్ద కేంద్రీకరింపబడుతుంది ఆ ఫోకల్ పాయింటువద్ద ఒక పెద్దబాయిలర్‌ను పెడతారు. ఆవేడికి బాయిలర్‌లోని నీరు సలసల మరిగి ఆవిరి (స్టీమ్)గా తయారతుంది ఆవిరితోయంత్రాలు నడుపబడుతున్న సంగతి మనందరికీ తెల్సిందే. ఇదే మోలెరో కనిపెట్టిన సూత్రంలో మోక్షం

మాస్కోలో మంచు ఫ్యాక్టరీ

మోలెరో సూత్రంతో మాస్కో లో ఒక మంచుగడ్డ ఫ్యాక్టరీ నడపబడు తోంది సూర్యకిరణాలను పోగు చేయడానికి ఆ ఫ్యాక్టరీలో 19½ అడుగుల వ్యాసం (డయా మీటర్) గల పెద్ద దొన్నె అద్దాన్ని నిర్మించారు. దాని ఫోకల్ పాయింటు వద్ద ఒక బాయిలర్ ను పెట్టారు. ఈకేంద్రీకృత సూర్యకిరణాల వేడి! (కొన్నివందల డిగ్రీల వేడి ఉత్పన్న మవుతుంది) బాయిలర్‌లోని నీరు త్వరితంగ ఆవిరి అవుతుంది. ఈ ఆవిరిని గొట్టాల ద్వార మంచుగడ్డ ఫ్యాక్టరీలోకి తీసుకు వెళ్ళి దానిలో అమ్మోనియా ద్రవంతో నింపబడివున్న బాయిలర్లను వేడి చేస్తారు తద్వారా తయారయే అమ్మోనియా ఆవిరి! ఇంకో డబ్బాలలో జొనిపి అక్కడ ఎక్కువ ఒత్తిడిని (ప్రెషర్

మానసికవ్యాధు లెందుకు వస్తాయి ?

"మానసికవ్యాధికి మందులేదు" అని ఒకసామెత అది వట్టిసామెతే కాదు, చాలా మంది నమ్మకంకూడా. సిగ్మండ్ ఫ్రీడ్ అనే మనస్తత్వశాస్త్రవేత్త సిద్ధాంతాలను అనుసరించే శాస్త్రజ్ఞులుకూడా అదే త్రోవలోవున్నారు శరీరానికీ మనస్సుకీ సంబంధం లేదనీ, మనస్సు అనేది ఈ బాహ్యశరీరానికి అతీతమైన ఏవో ఇతర అగోచరభావాలమీద ఆధారపడి వుంటుందనీ వారివాదం భౌతికవాదులైన ఆధునిక శాస్త్రవేత్త లెవరూ ఈ వాదాన్ని అంగీకరించరు. మెదడు (బ్రెయిన్) మన శరీరంలోని ఒకభాగమే అయివున్నప్పుడు, శరీరానికి సంబంధం లేకుండా అది ఎలా పనిచేస్తుంది ? అందుచేత, అదిసరిగా వుండటం, పనిచెయ్యడం అనేవి మనశరీర పరిస్థితినిబట్టే వుండాలి. వుంటాయి

అయితే, ఈ అగోచరభావాల 'శాస్త్రజ్ఞులు' ఇంకో ప్రశ్నతెస్తున్నారు కొన్నికొన్ని సందర్భాల్లో కష్టాలను, క్లిష్టసమస్యలను ఏదుర్కోడంలో శారీరకంగా బలహీనులుగా వుండేవారి కంటే, పుష్టిగాను, బలంగాను వుండేవారే, క్రిందుమీదై మానసిక వ్యాధులకు గురి అవుతున్నారే ! ఎందుచేత ?

ఇది గడ్డుప్రశ్నే! నిజానికి చాలకాలం వరకూ దీనికి సంతృప్తికరమైన సమాధానం

(మిగతా 20 వ పేజీలో)

కలుగజేసి తిరిగి ద్రవరూపంలోకి మారుస్తారు. ఈ ద్రవాన్నే రిఫ్రిజిరేటింగు యంత్రాల్లో ఉపయోగిస్తారు. మామూలు గాలి తగిలితే ఈ ద్రవం తొందరగా—మన స్పిరిట్ లాగా—ఆవిరి అయిపోతుంది. కాని ఇలా ఆవిరి అయ్యేటప్పుడు ఎంతో చల్లదనాన్ని యిస్తుంది ఈ చల్లదనాన్నే నీటిని మంచుగడ్డగా మార్చడానికి ఉపయోగిస్తారు. మోలెరో అంచనాలన్నీ రైట్ అయ్యాయి. 1945 నుంచీ ఈ మంచు ఫ్యాక్టరీపని చేస్తున్నది.

పారిశ్రామిక యంత్రాలు

మాస్కో విజయం తరువాత మోలెరో మరో అడుగు ముందుకు వేశాడు. టాష్కెంట్ అనే చోట ఒక పెద్ద పారిశ్రామిక యంత్రాన్ని నడప దానికి ఏర్పాట్లు చేయ బూనుకున్నాడు. దీనికి, ప్రపంచంలో కల్లా పెద్దదైన 32½ అడుగుల వ్యాసం (డయా మీటర్) గల అద్దాన్ని నిర్మిస్తున్నాడు. ఈ అద్దం 1500 డిగ్రీల(సెంటిగ్రేడ్) వేడిని సప్లయి చేస్తుంది. ఈసూత్రంతో యంత్రాలు నడపడానికి అయ్యే ఖర్చు ఎంతో తగ్గిపోతుంది సంవత్సరంలో సూర్యుడు ఎక్కువ రోజులుండే ప్రదేశాలన్నిటిలోనూ, ఇది ఎంతో లాభదాయకంగా వుంటుంది అందుచేత మధ్య ఆసియాలోని సోవియట్ రిపబ్లిక్‌లలో (ఇక్కడ సూర్యుడు సంవత్సరంలో 280 రోజు లుంటాడు) యంత్రాలు నడపడానికి ఇలాంటి ఏర్పాట్లుచేయాలని సోవియట్ సైన్సు ఎకాడమీ వారు ఆలోచిస్తున్నారు.

(19వ పేజీ తరువాయి)

కూడా దొరకలేదు కాని నేడుసరియైన జవాబు దొరికింది హడ్సన్‌హాగ్‌లాండ్, గ్రిగరీ పిన్‌కస్ అనే ఇద్దరు డాక్టర్లు దీనికి రుజువుతో కూడిన సమాధానం చెబుతున్నారు.

మానసిక వ్యాధులకు కారణాలు తెలుసుకోడానికి వీరు చాల కాలంనుంచి పరిశోధనలు చేస్తున్నారు.

మన శరీరంలో అన్ని అవయవాలతో పాటు మెదడుకుకూడా ఆహారం అందజేసి, అది విసర్జించే మలిన పదార్థాలను తీసుకుపోతూ వుండే ముఖ్యమైన ద్రవం రక్తం కనుక, మనకు మానసికంగా మార్పులు వచ్చినప్పుడే రక్త కణాలలో, ఎటువంటి మార్పులు వస్తాయో మొదట తెలుసుకోవాలని నిశ్చయించారు ఎప్పుడు కావాలంటే అప్పుడు రక్తంలోని రెండురకాల కణాలను (తెల్ల కణాలు, ఎర్రకణాలు) కొలిచే యంత్రం (పర్‌స్యూట్ మీటర్) ఒకదానిని నిర్మించారు. దానితో పరిశోధనలు సాగించారు

మనం ఒక విమానంలో కూర్చొని ఒక్కసారి అంతరిక్షంలోకి ఎగిరిపోయామనుకోండి. అలాఎగిరేటప్పుడు మనకుఅదోలాగవుంటుంది. మనస్సుకి ఏమిటో అనుపిస్తుంది శరీరం అంతటిలోను ఏదో చెప్పలేని వింతమార్పు వచ్చినట్లనిపిస్తుంది విమానం ఎక్కిన వాళ్ళకిది బాగాతెలుస్తుంది. ఇంకా చిన్న ఉదాహరణ కావాలంటే తిరణాళ్ళలో పైనుంచి క్రిందికి చక్రంలాగ తిరిగే"రంకులరాట్నం"లో ఎక్కిన వారికికూడా కొంత తెలుస్తుంది

ఈరెండు ఉదాహరణలలోనూ మన మనస్తత్వంలో ఒక ఆకస్మికమార్పు వస్తోంది హాగ్‌లాండ్, పిన్‌కస్ అనే డాక్టర్లు ఇద్దరూ ఈ ఉదాహరణను తీసుకొని, అలాంటప్పుడు రక్తకణాల్లో వచ్చే మార్పులను ఆయంత్రం ద్వారా గమనించ సాగారు. అలా భూమిని వదలి గగన వీధులలో విహరించే టప్పుడు మానవుని రక్తకణాల్లో లింఫోసైట్స్ అనే తెల్లకణాల సంఖ్య నూటికి 40 పాళ్ళు తగ్గిపోయినట్లు కనబడింది కాని దీనినే మానసిక వ్యాధులతో బాధపడే వారి విషయంలో పరిశీలించి చూస్తే ఈ తెల్లకణాల సంఖ్య తగ్గడానికి బదులు విపరీతంగా ఎక్కువ అయినట్లు కనబడింది. దీని నాధారంగా తీసుకొని, ఈ మార్పుకు కారణాలు ఏమిటో తెలుసుకో డానికి ఇంకా పరిశోధన సాగించారు.

మన శరీరంలో మూత్ర పిండాలకు (కిడ్నీస్) పైగా అడ్రినల్ గ్లాండ్స్ అనేమాంస గ్రంధు లున్నాయి శరీరంలోని ప్రధాన గ్రంధులలో ఇవి కూడా ఒకటి, ఇవి అడ్రినల్, కోర్టిన్ అనే రెండురకాల రసాయనిక ద్రవాలను తయారు చేస్తూ వుంటాయి. ఇందులో కోర్టిన్ అనే ద్రవం తెల్లకణా లనబడే లింఫోసైట్స్ యొక్క నిర్మాణానికి ఎక్కువ అడ్డుపడుతుంది. అందుచేత మానసిక వ్యాధులతో బాధపడే వారి శరీరంలో ఈ అడ్రినల్ గ్లాండ్స్ అనే గ్రంధులు సరిగా పనిచేయకుండా ఏదో లోపంతో వుంటున్నా యన్నమాట

కాని అంతమాత్రం లోనే మానసిక వ్యాధలకు మనకి చికిత్స దొరకలేదు. ఎందుకంటే ఈ అడ్రినల్ గ్లాండ్స్ (గ్రంధులు) సరిగా పని చేయడం అనేది తలలో వుండే పిట్యూటరీ గ్లాండ్ అనే గ్రంధిమీద ఆధారపడి వుంటుంది అంతేకాదు మళ్ళీ ఈ పిట్యూటరీ గ్లాండ్ (గ్రంధి) కూడా మెదడుకు అడుగు భాగంలో వుండే హైపోతలామస్ అనే గ్రంధి మీద ఆధారపడి వుంటుంది

వీటన్నిటిని బట్టి మనకి తేలేది ఏమిటి? మానసిక వ్యాధులు వస్తున్నాయంటే, ఆ మనుష్యుల శరీరంలో పైన పేర్కొనబడ్డ గ్రంధులు సరిగా పనిచేయక పోవడం వల్లనే అవి సంభవిస్తున్నాయి ఈ గ్రంధులలో వుండే జబ్బే దానికి కారణం, ఇది పై చూపులకి మనిషి పుష్టిగాను, బలంగాను వున్నట్టు కనబడు తున్నాడా లేక బలహీనంగా వున్నట్లు కనబడు తున్నడా అనే దానిని బట్టి కాదు నిర్ణయించ వలసినది ఇతర విధాల, శారీరకంగా బాగా వుండే వారిలో కూడా పైన పేర్కొన్న గ్రంధులలో జబ్బు వుండటంవల్ల మానసిక వ్యాధులు రావచ్చు. పైకి బలహీనంగా వున్నా ఈ గ్రంధులు సరిగా పనిచేస్తున్న వారికి మానసిక వ్యాధులు రాకపోవచ్చు

అందుచేత మానసిక వ్యాధులకు చికిత్స కావాలంటే తలలోవుండే ఈ హైపోతలామస్ గ్రంధి, పిట్యూటరీ గ్రంధి లేదా మూత్రపిండాలకు పైగావుండే అడ్రినల్ గ్రంధులు సరిగా పనిచేసేటట్లు, అవి ఆరోగ్యవంతగా వుండేటట్లు చేసేమందులు ఇవ్వాలి. ఇదివరకు కుదరవు అనుకొన్న అనేక వ్యాధులు "పెన్సిలిన్" అనే మందు కనిపెట్టబడిన తరువాత ఎలా కుదర్చ బడుతున్నాయో అలాగే, ఈనూతన పరిశోధనవల్ల, అనేక మానసిక వ్యాధులు చాల సులభంగా నయం అవుతాయని శాస్త్రజ్ఞుల అభిప్రాయం,

---


ఏజంట్లకు, పాఠకులకు ★

ఏప్రిల్ సంచికను పాఠకులకు చాలా ఆలస్యంగా అందిచాం. అయినా మే నెల సంచికను 20వ తేదీకి మీకు సమర్పించుతున్నాం

జూన్ నవయుగ 18 కే పూర్తి అవుతుంది కనుక విద్యార్థి ఫెడరేషన్ వర్కర్లు దీనిని గమనించి స్కూలు, కాలేజీ కేంద్రాలలోనూ తమ ఏజన్సీలను వెంటనే ఏర్పాటు జేయకోరుతాం రాష్ట్ర విద్యార్థి కౌన్సిలు సమావేశమునకు ఏజంట్లు డిపాజిట్ డబ్బుతో హాజరయిన — అచ్చటనుండి పత్రికలు తీసుకొని వెళ్ళవచ్చు.

మే సంచిక డబ్బు జూన్ 5వ తేదీకే ఆఫీసుకు చెల్లించి జూన్ సంచికలు ఎన్నికావలసినదీ ఏజన్సీలన్నీ తెలియపర్చ కోరుతాం

మేసంచిక మూడువేలు ముద్రించాం వెనుకటికాపీలు పంపమని పాఠకులనుండి, ఏజన్సీలనుండి జాబులు వస్తున్నాయి ఆఫీసులో వెనుక సంచికలు దొరకవు. ఆశాభంగం జరుగకుండా ఉండుటకు ముందుగానే ఏజన్సీ ద్వారాగాని, చందాకట్టిగాని మీ కాపీలను గూర్చి ఈనెలనుంచి జాగ్రత్తపడకోర్తాం. — మేనేజరు



గ్రంథసమీక్ష

★

నల్లగొండప్రజల వీరోచితపోరాటం'

రచన- శ్రీ దేవులపల్లి వెంకటేశ్వరరావు. ప్రజాశక్తి ప్రచురణాలయం-బెజవాడ, 32 పేజీలు, వెల 4 అణాలు.

నేటి సంస్థాన ప్రజా ఉద్యమాలలో తెలంగాణా పోరాటం ఒక ప్రత్యేక అధ్యాయం. ఇట్టి తెలంగాణా పోరాటమునకు నల్లగొండ ప్రజల పోరాటం జీవకర్ర లాంటిది అంతులేని నిర్బంధ విధానమును, సైనిక దాడులను ఎదిర్చి నల్లగొండ ప్రజలు వెనుకంజ వేయకుండా ఎట్లు నిలబడ గల్గినారు? జమిందారులను, జాగీరుదారులను, వాండ్లరౌడీ సైన్యాలను నల్లగొండ ప్రజలు ఎట్లు ఎదిర్చి పోరాడుచున్నారు? ఈ పోరాటంలో ప్రజా ఉద్యమం సాధించిన విజయాలు ఏమిటి? మున్నగు విషయాలను 32 పేజీలలో క్లుప్తంగా సింహావలోకనంచేశారు. ప్రజా ఉద్యమం నడచిన వివిధ దశలను, నల్లగొండ జిల్లా ప్రజలలో నేటి పోరాటం ఎట్లు నూతన సాంఘిక కట్టుబాట్లను, నూతన జీవిత ఆదర్శములను నిర్మించుచున్నదీ, యీ ఉద్యమాన్ని రంగంపై యుండి నడుపుతున్న వెంకటేశ్వరరావుగారు చక్కగా వర్ణించారు.

నేడు తెలంగాణా సోదరులు జరుపు పోరాటం, వారనుభవించుచున్న వెట్టి, నిర్బంధవిధానం జమీందార్ల దోపిడీకి వ్యతిరేకంగా జరుపు పోరాటము మాత్రమేగాదు, నేడు మూడుకోట్ల మంది ఆంధ్రులు ఐక్యమవకుండా అడ్డుతున్న నైజాం నవాబుపై, సామ్రాజ్య వాదులపై జరుపుచున్న విశాలాంధ్ర పోరాటం గూడాయిది. నల్లగొండ జిల్లా ప్రజలపై నైజాం సైన్యం జరిపే దాడులకుఅండగా తెల్లసైన్యం సలహాదారులుగా పంపబడు చున్నారు. ఈ విషయమే దీనిని స్పష్ట పర్చుతుంది. నల్లగొండ ప్రజలలో రగులు కొనిన యీ ప్రజా ఉద్యమాన్ని నేటి అందుకు అండగా తెల్ల సైన్యాలు గూడ పంపబడినవి.

తెలంగాణా సోదరులు తమ ఉద్యమాన్ని అన్నివిధాలా బలపర్చమని, సహాయంజేయమని తోటి ఆంధ్రులమైన మనవంక జూస్తున్నారు. తెలంగాణా ఉద్యమంతో మనం చేయి చేయి కలిపి నప్పుడే నల్లగొండ ప్రజల పోరాటమును సామ్రాజ్య వాదులు రక్తంలో ముంచి ఎత్తకుండ జేయగలం.

ఇందుకు ప్రతిఆంధ్రుని కర్తవ్యాన్నియీచిన్న గ్రంథం స్పష్ట పర్చుతూంది. ప్రతి ఆంధ్రుడు తెలంగాణా పోరాటంయెడ తన కర్తవ్యాన్ని నిర్వర్తించుటకుతప్పకచదువవలసిన పుస్తకం. భాష మృదువుగా నడచింది. పుస్తకం ప్రారంభించితే చివరివరకు వదలలేం.

(9 వ పేజీ తరువాయి)

నిలిపారు. మనదేశీయ ఐక్యత ప్రజ్వరిల్లింది.


కానివిప్లవం నలుదిశలా ఒక్కసారిగా రాకపోవటం, ఇది సైనిక విప్లవంగా మాత్రమే ఉండి అసంతృప్తితో రగులొక్కుంటున్న సామాన్య ప్రజలను సమీకరించక పోవటం వల్ల పూర్తి విజయం పొందలేక పోయాం. తగిన నాయకత్వం లేకపోవటం, మనదేశంలోనే స్వదేశ రాజులవంటి దేశ ద్రోహులు ఉండటం వల్లను 1859 నాటికి శాంతి లభించినట్లు కనపడింది. అది కనబడడం మాత్రమే తిరిగి బెంగాలు, మహారాష్ట్రములలో (షుమారు 1908 సం॥లో) సైనిక సంచలనంలో ఆ శక్తే మెరసింది. ఆ శక్తే క్రమంగా ప్రజలలో చైతన్యమూర్తి అయి, 1920 జాతీయ పోరాట వెల్లువగా మారి జలియన్ వాలాబాగ్ రక్త బలిదానం ద్వారా కార్మికకర్షక పోరాటాలతో సమర వాహినిగా బలీయం అయి, మరపురాని (1946 సం॥) నావికుల తిరుగుబాటుగా పరిణమించింది. భారత స్వతంత్ర్య సమరంలో తుది పోరాటానికి సమరశక్తిని చేకూర్చింది.

1857 సం॥లో భారతీయ సైనికులు, నానా సాహెబ్, పీష్వాల వంటి వారు నాయకత్వం వహించినప్పటికీ. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగాపోరాడి బ్రిటిష్ సామ్రాజ్యవాదపు పునాదిని కదిపారు, ఇలా కదపగల్గడానికి ముఖ్య కారణం ఐక్యతతో హిందూ ముస్లిం సిపాయిలందరూ పోరాడటమే. ఈ ఐక్యతకు తోడు ప్రజలు, సైనికుల మధ్య ఐక్యతకూడా ప్రజ్వరిల్లిఉంటే సంపూర్ణ విజయం సాధించియుండేవారే, ఈ విప్లవా నంతరం క్రమక్రమేణా సైనికులలో కదలిక వచ్చింది.

సైనికులందరూ, మత, కుల, భేదం లేకుండా పోరాటసన్నద్ధులు కాప్రారంభించారు, కదిలింది. ఈ ప్రజాచైతన్యం 1920, 1930. 1938 ఉద్యమాలలో చెలియలు కట్టలుదాటి ఉరకలు వేస్తూ స్వాతంత్ర్య శంఖాన్ని పూరించింది.

ప్రజాఉద్యమాలపై, సమిష్టి పోరాటాలపై కార్మిక కర్షక ఐక్యశక్తిపై, విద్యార్థి, యువక, సైనిక, శక్తులపై, విశ్వాసం లేనటువంటి నాయకుల నాయకత్వాన 1857 విప్లవాన్ని జ్ఞప్తికి తెచ్చే ఐక్యత, ఖిలాఫత్‌ను జ్ఞప్తికితెచ్చే ఐక్యత బలిఅయింది. చివరకు ఏ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా మన సైనికులు విప్లవాన్ని నడిపారో, యెవరిని "క్విట్ ఇండియా" అని అనేక ఉద్యమాలను నడిపామో, ఆ సామ్రాజ్యవాదుల కుట్రలకులోనై, వారు నాటిన ఉచ్చులోనే పడి, దేశాన్ని విభజించటానికి, కార్మిక, కర్షక ఐక్యతను విచ్ఛిన్నం చేయటానికి పైనాయకులే దారితీశారు. దీన్ని అవకాశంగా తీసుకొని, సామ్రాజ్యవాదులు కూష్లాండుప్లాను అయిన బ్రిటిషు మంత్రివర్గ పథకాన్ని అమలు జరపడానికై దేశం నలుమూలల మతకలహాలను, సోదరుల మధ్య అంతర్యుద్ధాన్ని లేవదీశారు, వారి తొత్తులయిన స్వదేశ సంస్థానాధీశులను అడ్డంపెట్టుకొని సంస్థానాలలో సామ్రాజ్య సైన్యాన్ని తిష్టవేయించి భారత స్వాతంత్ర్యాన్ని నామమాత్రంగా జేయవలెనని సామ్రాజ్యవాదులు సకల ప్రయత్నాలు చేస్తున్నారు. కాని మన స్వాతంత్ర్య పోరాట చరిత్రలో యువకశక్తి ప్రవేశించింది. దేశములో నలుమూలల్లో కార్మిక, కర్షక ఐక్యత, ప్రజా పోరాటాల్లో హిందూ - ముస్లిం ఐక్యత మరల తిరిగి సాధింపబడుతూంది. 1857 విప్లవంలోలేని ఐక్యతనుమనం సైనికులమధ్య ప్రజలమధ్య భారత నావికుల పోరాటంలో చూడగలిగాం. మన నావికుల పోరాటం, వారి సహాయార్థం మన ప్రజలు బొంబాయి, మొదలగు పట్టణాలలో ఒడ్చిన నెత్తురు. మనకు ఆ ఐక్యతా జ్యోతినిచ్చాయి.

మొట్టమొదటి ప్రజారణగర్జన 1857విప్లవ శక్తి అయిన హిందూ-ముస్లిం సైనికుల ఐక్యతనే ఆదర్శంగా తీసుకొని మనం ఐక్యతతో పురోగాములమవుదాం, మనం విప్లవ వీరుల సంతతివారమని ఋజువు చేదాం. ఏ పవిత్రాశయానికై ఐక్యతను సాధించి విజయం పొందాలని, మన పూర్వులందరూ సర్వత్యాగాలు చేశారో వారికి, వారి ఆశయానికి మనం చేయదగిన, చూపదగిన కృతజ్ఞత, వారు ఎత్తిన విప్లవ బావుటాను మనంనిలబెట్టటమే, వారిని స్మరిస్తూ ఐక్యతా నిర్మాణానికి, సంపూర్ణ విజయానికి కృషి సల్పుటయే



పరీక్షలు - అధికార్ల కుట్రలు

ఆర్యా!

ఈసంవత్సరం ఆంధ్రదేశంలోని కళాశాలలలోను, హైస్కూళ్ళలోను డిటెన్షన్ విధానమునకు వ్యతిరేకంగా అనేక విద్యార్థి సమ్మెలు జరిగినవి. చాలచోట్ల విద్యార్థుల ఒత్తిడి ఫలితంగా డిటైన్ చేయబడిన విద్యార్థులు సహితం పరీక్షలకు పంపబడినారు. ఈ డిటెన్షన్ల వ్యతిరేక ఆందోళన ముందుసంవత్సరములలో యింకా తీవ్రతరమవనున్నదని విద్యాశాఖాధికారులు గాభరా పడుచున్నారు. విద్యార్థుల యీఆందోళనను నిర్మూలించుటకు వీరు నూతన ప్లానులు తయారుజేయుచున్నారు. ఈప్లానులను యీసంవత్సరం యూనివర్సిటీ తరగతుల్లో అమలు జరుపుతారని తెలుస్తున్నది.

ఈప్లాను ప్రకారం ఇంటర్మీడియట్. బి.ఎ; క్లాసులలో పబ్లిక్ పరీక్షలకుముందు విద్యార్థులను డిటైన్ జేయుపద్ధతిని రద్దుజేస్తూ, ఇంటర్మీడియట్. బి. ఎ., మొదటి సంవత్సరములలో విద్యార్థులను పైతరగతులకు పంపునపుడు వీలయినంత హెచ్చుమంది విద్యార్థులను తప్పించవలయునని, ఈపద్ధతితో సంవత్సరం మధ్యలో బి. ఎ; ఇంటర్మీడియట్ లలో డిటైను చేయువారి సంఖ్యనుగూడ జూనియర్ తరగతులలోనే డిటైన్ జేయవలయునని యీ యీప్లాను.

ఈ విధంగానే హైస్కూళ్ళలో స్కూలు ఫైనలు క్లాసులో డిటెన్షనును రద్దుజేస్తూ 5 వ ఫారం విద్యార్థులను ప్యాసుజేయు విషయంలో చాల కఠినంగా నుండవలయునని అధికార్లు ఆలోచనలు జేయుచున్నట్లు తెలియుచున్నది.

ఈ పద్ధతులద్వారా డిటెన్షన్ విధానమును రద్దుజేసినట్లు విద్యార్థులకండ్లు కప్పవచ్చునని తెరవెనుకమాత్రం ప్రతిసంవత్సరంవలె విద్యార్థులను జూనియర్ తరగతులలోనే డిటెయిన్ జేస్తూ, తాము డిటెన్షన్‌లు ఎందుకు పెట్టారో ఆ ఆశయాలను నిలబెట్టుకోవచ్చునని అధికారుల ఆశ.

ఈ పద్ధతులేవీ విద్యార్థులను మోసగించలేవు. ఈ సంవత్సరం 5 వ ఫారం విద్యార్థులను ప్యాసుజేయుటలోగాని, కళాశాలలో జూనియర్ తరగతుల విద్యార్థుల ప్రమోషనులలోగాని ఎట్టి కృత్రిమ పద్ధతులవలంబించినా విద్యార్థులు చివరిదాకా పోరాడకమానరు. అధికారులు యీ విషయమును గుర్తించి, ఎట్టి అవక తవక ప్లానులు అమలు జరుపరని ఆశించుతాం. విద్యాలయాల్లో నిజమైన శాంతిని కోరినచో, బానిస విద్యావిధానమును దానినుండి ఉద్భవించే డిటెన్షన్ పద్ధతిని ప్రభుత్వం వెంటనే రద్దుజేయాలి.

దాసరి నాగభూషణరావు,
కృష్ణాజిల్లా విద్యార్థి ఫెడరేషన్, అధ్యక్షుడు

★

పరీక్షాపత్రాల్లో అవకతవకలు

ఆర్యా,

ఈ సంవత్సరం కృష్ణాజిల్లా బోర్డు హైస్కూళ్లలో 6వ ఫారమునకు సంవత్సరాంతపు పరీక్షలలో కామన్ వాల్యువేషన్ (Common-valuation) పద్ధతి అమలుపర్చబడినది. ఈ పద్ధతి విద్యార్థులకు నష్టకరమని ఉపాధ్యాయులు కూడ అంగీకరించారు. దీనిని అమలు పర్చవద్దని విద్యార్థి సంఘాలు ఆందోళన చేసినప్పటికిని పెడచెవినిబెట్టి జిల్లాబోర్డు విద్యాశాఖాధికారులు ఈ విధానమును అమలుపర్చుతున్నారు.

దీనికి తోడు కొన్ని పరీక్షాపత్రములు తరగతిని మించిన విద్యాస్థాయి (Standard) లో ఉన్నవి. కొన్ని ప్రశ్నలు పాఠ్య గ్రంథములలో లేనివి గలవు. జాగ్రఫీ, 'సి' గ్రూపు హిస్టరీ, ఇంగ్లీషు రెండవ పేపరులో పాఠ్య గ్రంథములలో లేని ప్రశ్నలుగలవు. కాబట్టి పై తరగతులలోనికి ప్రమోషన్ చేయునపుడు పైన ఉదహరించబడిన పేపర్లలో వచ్చిన మార్కులకు తగినట్లుగా మార్కులు హెచ్చించవలసిన అవసరంగలదు. లేనిచో విద్యార్థులు తీవ్ర నష్టమునకు గురిఅవుతారు. పై సూచనను అమలుపర్చవలసినదిగా కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారులను జిల్లా బోర్డు అధికారులను కోరుచున్నాను. ఉపాధ్యాయులుకూడ కలుగజేసుకొని విద్యార్థులకు సాయపడవలసినదిగ కోరుచున్నాను.

టి. రఘురామారావు
బెజవాడ విద్యార్థి ఫెడరేషన్, సహాయకార్యదర్శి.

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ కౌన్సిల్ సమావేశం

కాకినాడ రాష్ట్ర మహాసభ అనంతరం విద్యార్థి లోకంలో అనేక ముఖ్యమైనమార్పులు వచ్చినవి. బ్రహ్మాండమైన డిటెన్షన్ వ్యతిరేక పోరాటం సాగింపబడింది. మరల స్కూళ్ళు తెరచే సమయం దగ్గరకు వస్తున్నది. యడ్మిషన్లు, జీతాలు, ఉపాధ్యాయుల సమ్మె, నేటి రాజకీయ కల్లోలస్థితి విద్యార్థులను కలవర పరుస్తున్నవి. వీటినిగురించి మన కార్యక్రమం నిర్ణయించుకొనుటకే యీసమావేశం. సమావేశం అఖిల భారత విద్యార్థి కౌన్సిల్ సమావేశం అనంతరం జరుపబడుటచే అచ్చటినిర్ణయములుగూడ చర్చింపబడును. కనుక కౌన్సిల్ సభ్యులు స్థానిక సంఘ నాయకులు తప్పక హాజరు కావలయును. సమావేశం కృష్ణాజిల్లాలో జరుగును. ప్రదేశం ముందు ప్రకటింపబడును.

కార్యదర్శి.
ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్

గాజుల్లంక రైతులపై పోలీసుల హింసాకాండ

గాజుల్లంక రైతులు తమ న్యాయమైన హక్కులకోసం గత సం॥నుండి అచంచలమైన దీక్షతో పోరాటాన్ని నిరంకుశ చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకముగా సాగిస్తున్నారు. కాంగ్రెస్ మంత్రివర్గం తమకు అండదండగా నిలబడుతుందని ఎన్నికల ప్రణాళిక, పత్రికా ప్రకటనలను బట్టి ఆశించారు. కాని జమీందారీ తొత్తులు కాంగ్రెస్ మంత్రివర్గం చుట్టూ తిరిగి రాజీ తతంగం జరిపించారు. మాజీ పార్లమెంటరీ కార్యదర్శి కె. లింగరాజుగారు రాజీ ప్రయత్నానికి బయలుదేరారు. లింగరాజుగారు తమ తీర్పులో జమీందారును బలపర్చారు. దీనితో రైతాంగం నిరుత్సాహపడక తమ స్వశక్తిపై నిలబడ నిశ్చయించింది. ఈ చలించని దీక్షను సడలింపజేసేందుకు చల్లపల్లి జమీందారు పోలీసు బలగాన్ని గాజుల్లంక రైతాంగంపైకి పంపాడు

అది ఏప్రియల్ 10. రాత్రి 10 గం॥ సమయము. గాజుల్లంక రైతులు పవిత్ర కృష్ణ యిసుక తిన్నెలనుండి వచ్చే వాయువును పీల్చుతున్నారు. కొద్దిమంది రైతులు మామూలు ప్రకారం రెల్లుగడ్డిని అమ్ముకోవటానికి యితర గ్రామాలకు తోలుకు పోతున్నారు. యింతలోకి రాక్షస రూపంలో పోలీసులు ప్రత్యక్షమై రెల్లుగడ్డిని తోలుకుపోయే రైతులను అడ్డగించారు. ఈ వార్త విని గ్రామంలోని రైతాంగం అంతా కదలి వచ్చి అడ్డం కొట్టడం అన్యాయమని పోలీసులకు నచ్చజెప్పారు. రైతులు చెప్పింది ఒప్పుకొన్నట్లు పోలీసులు నటించారు. రైతులు తిరుగు ముఖంపట్టారు. ఈ అదును చూచుకొని తమ హింసాకాండను సాగించారు. వెనుకకు తిరిగింది వియ్యమ్మ. వెనకపాటు నుండి పోలీసు ఆమె ముచ్చలగుంటలో బాయ్‌నెట్ ఛార్జీచేసాడు. ఆ మరుక్షణమే నేలకొరిగింది వీరనారి వియ్యమ్మ. గాజుల్లంక వీరాంగనల వేగుచుక్క క్రుంకిపోయింది.

ఇది తనకళ్ళార చూసాడు ఆగ్రిమ యువక సింహంలాగా మెలగుతున్న సనకా సుబ్బారావు. తనరక్తనాళాలలో ఉప్పొంగే వేడి రక్తం యీ అన్యాయాన్ని సహించ లేకపోయింది. వీరాంగన వియ్యమ్మను చంపటం ఒక్క దివి తాలూకా రైతు లోకానికేకాక యావదాంధ్ర రైతులోకానికి సవాల్‌గా భావించి సనకా సుబ్బారావు రణరంగాని కురికాడు. తుపాకిగుండు ఫలితంగా తన గుండెనుండి వేడిరక్తధార కృష్ణాప్రవాహంలో కలిసినా గుండె నిబ్బరం హెచ్చింది. న్యాయసంస్థాపనకోసం ముందు కురికి మరొక తుపాకిగుండుతో కృష్ణమ్మ తల్లిని కౌగలించు కొన్నాడు. యువక సింహం నేల కొరగటం చూసిన పోలీసు రాక్షసులు తమ కాల్పులను విచ్చలవిడిగా సాగించారు. తత్ఫలితమే మరియిద్దరు మరణించటం. వీరిలో ఒకరు పాలబుగ్గలారని తాడిపర్తి వెంకటేశ్వరరావు బుర్రకథకు వెళ్ళి వస్తున్నాడు. అనేకమంది గాయపడటం జరిగింది, నాలుగు నిండు ప్రాణాలు మననుండి తరలిపోయినా తరతరాలకు ఆంధ్రరైతాంగానికి దివ్యపథాన్ని చూపెట్టింది గాజుల్లంక రైతాంగం, ఈవీరుల, వీరాంగన త్యాగప్రతిభ వేనోళ్ళ చరిత్ర

(మిగతా 24 వ పేజీలో)

బెజవాడ కమ్మహాస్టలు

విద్యార్థివసతి గృహమా? లేక క్రీడామందిరమా?

బెజవాడలో 1924 సం॥లో కమ్మవిద్యార్థుల సౌకర్యమునకని కీ॥ శే॥ శ్రీ కోవెలమూడి గోపాలకృష్ణయ్యగారిలాంటి పెద్దల కృషి ఫలితంగా హాస్టలు నిర్మింపబడింది. అప్పటినుండి ప్రతిసంవత్సరం 60, 70 మంది విద్యార్థులు యీ హాస్టలులో నివసించుతూ విద్యాభ్యాసం జేస్తూయుండేవారు. కాని రాను రాను హాస్టలు నిర్వాహకులు హాస్టలుయెడ శ్రద్ధచూపుట మానివేశారు. దీనిని అనుకూలంగా తీసుకొని 1943-44 సం॥లు వచ్చేటప్పటికి విద్యార్థులకన్నా బయటవారు యిందులో హెచ్చుమంది నివాసముండుట జరుగుతూ వచ్చింది. దీనితో అనేకమంది విద్యార్థులకు గదులు దొరకకపోవుటగూడ జరిగింది. ఈ విషయం విద్యార్థులు అనేకసార్లు నిర్వాహకులకు తెలియపర్చినా ఫలితం లేకపోయింది. అందుచేహాస్టలులోని విద్యార్థులు ఐక్యమై, విద్యార్థులు కానివారిని బయటికి పంపుట జరిగింది. విద్యార్థులలో యీ ఐక్యతా సూచకంగా ఒక కమిటీని ఎన్నుకొని హాస్టలు నిర్వహణను ఆదర్శప్రాయంగా జరుపుకొన్నారు. విద్యార్థులలోని యీ చొరవ, 1945 సం॥లో వార్డెనుగా నియమింపబడిన మల్లెల సూర్యనారాయణగారికి రుచించలేదు. సూర్యనారాయణగారు వార్డెను అయిన మరురోజునుంచి హాస్టలును తన స్వంత ఆస్థిగా జేసుకొన్నాడు. ఒకప్రక్క విద్యార్థులకు పరీక్షలు జరుగుచున్నా హాస్టలును పెండ్లి పబ్బాలకు, తన మిత్రులకు కట్టబెట్టుట జరిగింది విద్యార్థులు యీ పద్ధతులను నిరసించితే పోలీసులు, రౌడీలు ప్రదర్శింపబడ్డారు. విద్యార్థులకు పరీక్షలు జరుగుచున్నా లెక్కచేయక యీ మహామహుడు హాస్టలులో, భోగంమేళములను తెప్పించి ఆడించమొదలుపెట్టాడు. రాజమండ్రి వర్తకులతో తనకున్న వ్యాపార సంబంధములను నిలబెట్టుకొనుటకు సూర్యనారాయణగారు విద్యార్థుల జీవితములతో చెలగాట మాడారు. విద్యార్థులు వీటిని, వ్యతిరేకించారు. ఈ 'విద్యాభిమాని' విద్యార్థులలో చీలికలుతేప్రయత్నించి విఫలుడయ్యాడు అందుచే యిక తన పెత్తనం సాగదని నూతన సంవత్సరమునకు విద్యార్థులు తిరిగి వచ్చేటప్పటికి (1945 జూన్) హాస్టలులో ప్రవేశించుటకు నూతన రూల్సు ఏర్పరచాడు, ఈ వార్డెన్, ఇదివరకులేని అద్దె వసూలును ప్రవేశపెట్టాడు, విద్యార్థినుండి, తలిదండ్రుల నుండి 60 రూ॥ డిపాజిటు కట్టాలని నిర్బంధించాడు. సంవత్సర మంతటా సత్ప్రవర్తన కల్గి యుంటానని విద్యార్థి, సంరక్షకుడుహామీ యివ్వాలి.

ఈ నిర్బంధములన్నీ విద్యార్థులను బాగుపర్చుట కని మల్లెల సూర్యనారాయణ గారు సమర్థించుకొన జూచాడు. ఇందులోని రహస్యమంతా తన ఆటలు హాస్టలులో సాగుటకు చేసినవేయని ప్రతిఒక్కరకూ తెలుసు. దీని ఫలితం ఏమిటి? హాస్టలు, విద్యార్థుల సంఖ్య 16 మందికి వచ్చింది. హాస్టలు విద్యార్థులవసతి గృహంగా కాక మల్లెలవారి క్రీడా మందిరమయింది.

దాసరి నాగభూషణరావు
అధ్యక్షులు, కృష్ణాజిల్లా విద్యార్థి ఫెడరేషన్

నేడు హాస్టలులో వంటశాలలున్నా భోజన సదుపాయాలు లేవు. అందుచే బయట హోటళ్ళలో తినవలసి వచ్చుచున్నది. హాస్టలుకు యిద్దరు ఘూర్కాలు కాపలా. వీళ్లు హాస్టలు ఆస్థిని ధ్వంసం చేయుచున్నారు. భోజనశాలలోని పీటలన్నీ పొయ్యిలోకి ఉపయోగించారు. రోజూ విద్యార్థులతో కజ్జాలకుదిగి, కత్తులుతీసి బెదరించు తుంటారు. రోజూ ఈఘూర్కాలు చీట్ల పేకలతోను, వేశ్యలతోను హాస్టలులో కాలం గడుపుతారు. ఈ విషయాలు ఎన్నిసార్లు సూర్యనారాయణ గారికి తెలియ జేసినా ఫలితం లేకపోయింది. పైపెచ్చు విద్యార్థులపై విరుచుకు పడుట జరిగింది.

బెజవాడ కమ్మహాస్టలు నేడు నడుస్తున్న విధం, విద్యార్థుల సౌకర్యం కొరకు విరాళములిచ్చిన విద్యాభిమానుల నందరినీ కలవరపర్చక మానదు. విద్యార్థులమీద కక్షతోనూ, తన వ్యక్తిగత పెత్తనం కొరకూ సూర్యనారాయణ గారు హాస్టలు పేరు ప్రతిష్టలనే మంటగలుపు దిగజారుడు ప్రవర్తనకు దిగుచున్నారు. ఇది విద్యాభివృద్ధికి తోడ్పడక పోగా తీరని దెబ్బకొట్టుతుంది కనుక హాస్టలు నిర్మాణమునకు తోడ్పడిన విద్యాభిలాషులు, యితర కమిటీ మెంబర్లుకదలి మల్లెల సూర్యనారాయణ గారి నిరంకుశ ప్రవర్తనను అరికట్ట వలసినదిగా విజ్ఞప్తి జేయుచున్నాను. హాస్టలులో విద్యార్థులు జేరుటకు అడ్డువస్తున్న కొత్త రూల్సును, ఘూర్ఖాలను తొలగించాలి అప్పుడే హాస్టలు వేశ్యామందిరంగా కాక-విద్యానిలయం కాగలదు.

(28 వ పేజీ తరువాయి)

చాటకమానదు. ఈఅమర జీవుల ఆశయ సాధ
నకు కృషిసల్పి ఆంధ్రజాతి పిడికిలి బిగియించి
ప్రతినబూనింది.

ఈ అమరజీవులు మనలను వీడి నెలదాటి
పోయింది. ఆంధ్రదేశమంతటా యీకాల్పులను
నిరసిస్తూ వారలకు జోహార్లర్పిస్తూ సభలు
ప్రదర్శనాలు జరుప బడ్డాయి. ఇంతెందుకు
మూడుకోట్ల ఆంధ్రలోకం ముక్తకంఠంతో
యీ కాల్పులను ఖండించింది. ఈ వత్తిడి
తట్టుకోలేక మద్రాసు కాంగ్రెస్ మంత్రివర్గం
నిష్పాక్షిక విచారణ కమిటీని పేరుకుమాత్రం
వేసింది. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీ జిల్లా
యువజన సంఘాలు తమప్రతినిధి వర్గాలను
గాజుల్లంకకు ప్రత్యేకంగా పంపాయి. చని
పోయిన కుటుంబాలకు నష్టపరిహార మిప్పించి
ఆపీరుల చిరకాల వాంఛయైన జమిందారీవిధానం
రద్దుకు ఆందోళన చేయాల్సిన బాధ్యత ఆంధ్ర
విద్యార్థి, యువకులపైనుంది.

ఇదే వీరనారి వియ్యమ్మ; యువసింహం
సుబ్బారావులు మననుండి వీడిపోతూ యిచ్చిన
సందేశం !

Printed by S. V. Narasaiah at the Prajasakti Press, Mogalrajapuram, Bezwada.
& Published by K. Advita Parabrahma sastri from Navayuga office, 8th line Arandelpet, Guntur

Printed by S. V. Narasaiah at the Prajasakti Press, Mogalrajapuram, Bezwada & Published by K. Advita Parabrahma sast Navayuga office Mainroad Kottapet, Guntur. Editor S. V. Narasaiah. —Title Printed at Universal Press, Bezwada